ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

వార్త

సోమవారం 20, జులై 2026 16 పేజీలు





# గోదావరి పుష్కరాలే టార్గెట్..!

భద్రాద్రి అభివృద్ధికి మంత్రి పొంగులేటి డెడ్‌లైన్

ఆలయం నుంచి భూ రీసర్వే వరకు.. జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు

పుష్కరాలకు 15 రోజుల ముందే అన్ని పనులు పూర్తి చేయాలని తేల్చిచెప్పిన మంత్రి



2వ పేజీలో...

**భద్రాచలం, ప్రభాతవార్త**

గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భద్రాద్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార-పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం భద్రాచలం, సారపాకలో నిర్వహించిన వరుస కార్యక్రమాల్లో ఆలయ పునరుద్ధరణ, పుష్కరాల ఏర్పాట్లు, భూముల రీ సర్వే, అటవీ-రెవెన్యూ సమస్యలు, శ్రీనివాసగుట్ట అభివృద్ధి తదితర అంశాలపై అధికారులకు గడువులతో కూడిన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భద్రాచలం ఆలయ దర్శనంతో ప్రారంభమైన మంత్రి పర్యటన... జిల్లా అభివృద్ధి అంశాలపై సుదీర్ఘ సమీక్షలతో ముగిసింది. మంత్రి తొలుత భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్కడి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంజినీరింగ్,

## ప్రజా ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధికి సమ ప్రాధాన్యం

అశ్వాపురం, మణుగూరు మండలాల్లో రూ. 32 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



8వ పేజీలో...



2వ పేజీలో...

ఖమ్మం అభివృద్ధికి డబుల్ బూస్ట్

మధిరకు జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల..

ఇల్లందులో రూ.11.80 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

# భట్టి మార్క్

**ఖమ్మం, ప్రభాతవార్త ప్రతినిధి జూలై 19:** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారు. ఒకవైపు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మధిర ప్రభుత్వ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఆమోదం తెలపగా, మరోవైపు ఇల్లందు నియోజకవర్గంలో రూ.11.80 కోట్ల అభివృద్ధి పనులకు స్వయంగా శంకుస్థాపనలు చేసి అభివృద్ధికి వేగం పెంచారు. విద్య, మౌలిక సదుపాయాల రంగాల్లో ఒకేరోజు రెండు కీలక నిర్ణయాలు వెలువడటంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మధిర నియోజకవర్గంలో ప్రభుత్వ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు దశాబ్దాల కలగా మిగిలిపోయిన నేపథ్యంలో, భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో

8వ పేజీలో...



ఇందిరమ్మ ప్రభుత్వంలో..

## రైతులకు పెద్దపీట

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి : ఉప ముఖ్యమంత్రి భట్టి

# ఫీజులు వసూలు చేసి.. పిల్లల ప్రాణాలతో చెలగాటం?



భద్రాద్రి జిల్లాలో ప్రైవేట్ స్కూల్, కాలేజీ బస్సులపై తీవ్ర ఆందోళన

ఫిట్‌నెస్ లేని వాహనాలు..

శిక్షణ లేని డ్రైవర్లు..

డ్రైవర్‌కే కాదు.. యాజమాన్యానికీ బాధ్యత ఉంది?

మద్యం సేవించిన డ్రైవర్‌తో స్కూల్ బస్సు నడిపిస్తున్న వైనం...

నిబంధనలు గాలికి.. అధికారుల నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆగ్రహం

2వ పేజీలో...

**కొత్తగూడెం, ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సుల నిర్వహణపై తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మోటార్ వాహన చట్టం, పాఠశాల బస్సుల భద్రతా నిబంధనలు అమలు కావడం లేదని, ఫిట్‌నెస్ లేని బస్సులు, తగిన శిక్షణ లేని డ్రైవర్లతో విద్యార్థులను తరలిస్తున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన బస్సు డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఘటనలతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. డ్రైవర్లపై కేసులు నమోదైనా, వారిని విధుల్లోకి పంపిన యాజమాన్యాలపై మాత్రం చర్యలు కనిపించకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.జిల్లాలోని కొన్ని విద్యాసంస్థలు భారీ ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ విద్యార్థుల భద్రత విషయంలో తీవ్ర నిరక్ష్యం ప్రదర్శిస్తున్నాయని తల్లిదండ్రుల ఆరోపణలు చేస్తున్నారు. కొన్ని బస్సులకు సరైన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోవడం, అత్యవసర భద్రతా పరికరాలు లేకపోవడం, అనుభవం లేదా తగిన శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడపించడం వంటి అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయని వారు చెబుతున్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలను ఈ అంశాలపై ప్రశ్నిస్తే సరైన సమాధానం ఇవ్వకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నారని కూడా పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. "ఫీజులు మాత్రం లక్షల్లో వసూలు చేస్తున్నారు.. కానీ మా పిల్లల భద్రతపై బాధ్యత తీసుకోవడం లేదు.

# ఫీజులు వసూలు చేసి.. పిల్లల ప్రాణాలతో చెలగాటం?

## మొదటి పేజీ తరువాయి..

**నిబంధనలు అమలు చేయాలని డిమాండ్...**

జిల్లాలో నడుస్తున్న ప్రైవేట్ స్కూల్, కాలేజీ బస్సులపై రవాణా శాఖ, విద్యాశాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారా? ఫిట్‌నెస్, పర్మిట్, డ్రైవర్ల అర్హతలను పరిశీలిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. మోటార్ వాహన చట్టం ప్రకారం ప్రతి విద్యాసంస్థ బస్సుకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్, అర్హత కలిగిన డ్రైవర్, అవసరమైన భద్రతా పరికరాలు ఉండాలని నిబంధనలు ఉన్నాయి. వీటి అమలుపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల రవాణా వ్యవస్థపై ప్రశ్నల వర్షం**

ప్రతి ఉదయం వేలాది మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. తమ పిల్లలు సురక్షి తంగా విద్యాసంస్థలకు చేరుకుంటారనే నమ్మకంతో తల్లిదండ్రులు పంపిస్తున్నారు. అయితే ఇటీవల జరిగిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో కొన్ని విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడటంతో జిల్లాలోని స్కూల్ బస్సుల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో జిల్లాలో నడుస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు నిజంగా నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు చెల్లుబాటులో ఉన్నాయా? డ్రైవర్లకు తగిన అర్హత, శిక్షణ ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**మద్యం సేవించిన డ్రైవర్‌తో స్కూల్ బస్సు నడిపిస్తున్న వైనం...**

ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన బస్సు డ్రైవర్లు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఘటనల నేపథ్యంలో, డ్రైవర్లతో పాటు సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాల బాధ్యతపైనా చర్చ మొదలైంది. డ్రైవర్‌పై మాత్రమే చర్యలు సరిపోతాయా? లేక బస్సును విధుల్లోకి పంపిన యాజమాన్యంపైనా చట్టపరమైన బాధ్యత ఉంటుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రతి కేసులోని వాస్తవాలు, సేకరించిన ఆధారాలను బట్టి దర్యాప్తు సంస్థలు తగిన చట్టపరమైన సెక్షన్లను వర్తింపజేస్తాయి. మద్యం సేవించిన డ్రైవర్‌ను విధుల్లోకి అనుమతించినట్లు ఆధారాలు లభిస్తే, డ్రైవర్‌తో పాటు యాజమాన్యం లేదా సంబంధిత బాధ్యుల పాత్రను కూడా పోలీసులు పరిశీలించే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

**చట్టం ఏం చెప్తోంది...**

మోటార్ వాహన చట్టంలోని సెక్షన్ 188 ప్రకారం, వాహనం నడపడానికి అర్హత లేని వ్యక్తికి వాహనం అప్పగించిన సందర్భాల్లో బాధ్యత అంశం పరిశీలనకు రావచ్చని న్యాయవాదులు చెబుతున్నారు. అలాగే సెక్షన్ 190 కింద వాహనం లేదా దాని వినియోగం ప్రజల భద్రతకు ప్రమాదకరంగా ఉందా అనే కోణంలో కూడా అధికారులు పరిశీలించవచ్చని వివరిస్తున్నారు. అదేవిధంగా, దర్యాప్తులో నిరక్ష ్యం లేదా ఇతర చట్టవిరుద్ధ చర్యలకు సంబంధించిన ఆధారాలు ఉంటే, మోటార్ వాహన చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) లేదా ఇతర వర్తించే చట్టాల కింద కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు...మోటారు వాహనాల చట్టం, 1988లో సెక్షన్ 188 అండ్ సెక్షన్ 190సెక్షన్ 188 – నేరానికి ప్రేరేపించడం (అబెట్మెంట్ అఫ్ ఆఫెన్సెస్):.. ఈ సెక్షన్ ప్రకారం, మోటారు వాహనాల చట్టంలోని ఏదైనా నేరాన్ని చేయమని ప్రోత్సహించినా, సహకరించినా లేదా కావాలని అనుమతించినా, ఆ వ్యక్తి కూడా నేరస్థుడిగానే పరిగణించబడతాడు. అంటే, వాహనం యజమాని లేదా ఇతరులు డ్రైవర్‌ను చట్టవిరుద్ధంగా వాహనం నడపడానికి ప్రోత్సహిస్తే, వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. సెక్షన్ 190 – సురక్షి తం కాని వాహనాన్ని ఉపయోగించడం (యూసింగ్ వెహికల్ ఇన్ అన్సేఫ్ కండిషన్):... ఈ సెక్షన్ ప్రకారం, బ్రేకులు, స్టీరింగ్, టైర్లు, లైట్లు లేదా ఇతర ముఖ్యమైన భాగాలు సరిగా లేకపోయినా వాహనాన్ని రోడ్డుపై నడపడం నేరం. ఇటువంటి వాహనం ప్రమాదాలకు కారణమైతే, డ్రైవర్‌తో పాటు వాహన యజమానిపైనా జరిమానా లేదా ఇతర చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు.

**తల్లిదండ్రుల ప్రధాన డిమాండ్లు ఇవే...**

తల్లిదండ్రుల ఆరోపణల ప్రకారం కొన్ని విద్యాసంస్థలు భారీ ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, విద్యార్థుల భద్రత విషయంలో మాత్రం రాజీ పడుతున్నాయి. యాజమాన్యాలను ప్రశ్నిస్తే సరైన సమాధానం ఇవ్వకుండా నిరక్ష ్యంగా వ్యవహరిస్తున్నారని వారు వాపోతున్నారు. రవాణా శాఖ, విద్యాశాఖ అధికారులు జిల్లాలోని అన్ని స్కూల్, కాలేజీ బస్సులపై సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ స్కూల్, కాలేజీ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, ఫిట్‌నెస్ లేని బస్సులను వెంటనే రోడ్డుపై నుంచి తొలగించాలని, అర్హత, శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడిపే యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భద్రతను నిరక్ష ్యం చేసిన విద్యాసంస్థలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. "డ్రైవర్ తప్పు చేస్తే అతనిపై చర్యలు తీసుకోవడం సరిపోదు. పిల్లల భద్రతకు పూర్తి బాధ్యత వహించాల్సిన యాజమాన్యాలపైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. జిల్లాలోని అన్ని స్కూల్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి విద్యార్థుల భద్రతకు భరోసా కల్పించాలి" అని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**"సురక్షి త ప్రయాణం – సురక్షి త జీవితం" : లక్కినేని సత్యనారాయణ, ప్రెసిడెంట్ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ఫర్ ది స్టేట్ ఆఫ్ తెలంగాణ**

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. చట్టాలను పాటించడం కేవలం జరిమానా తప్పించుకోవడానికే కాదు, మన ప్రాణాలను మరియు ఇతరుల ప్రాణాలను కాపాడడానికీ అవసరం. సురక్షి తమైన వాహనాన్ని మాత్రమే నడపండి. ట్రాఫిక్ నిబంధనలు పాటించండి. చట్టవిరుద్ధమైన పనులకు ఎవరినీ ప్రోత్సహించవద్దు. మోటారు వాహనాల చట్టం, 1988లో సెక్షన్ 188 అండ్ సెక్షన్ 190, సెక్షన్ 188 – నేరానికి ప్రేరేపించడం (అబెట్మెంట్ అఫ్ ఆఫెన్సెస్), సెక్షన్ 190 – సురక్షి తం కాని వాహనాన్ని ఉపయోగించడం లాంటి చట్టాలు పనిచేస్తున్నాయి. "సురక్షి త ప్రయాణం – సురక్షి త జీవితం" అనే లక్ష ్యంతో ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు.

**తనిఖీలు ముమరం చేయాలి: పోనిశెట్టి వెంకటేశ్వర్లు బిజెపి జిల్లా నాయకుడు**

జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన బస్సులపై రవాణా శాఖ నిఘా ఏర్పాటు చేసి నిత్యం తనిఖీలు నిర్వహించాలి. బస్సులు నడిపే డ్రైవర్లకు లైసెన్స్ ఉందా లేదా, వారు బస్సులు నడిపేందుకు ఫిట్గా ఉన్నారా లేదా అనే విషయాలతో పాటు బస్సుల ఫిట్నేస్ పై కూడా దృష్టి సారించాలి. కొన్ని విద్యాసంస్థలు ఒకే నంబర్ ప్లేట్ పై పదుల సంఖ్యలో బస్సులు నడిపిస్తున్నారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లో ఫిట్నేస్ లేని బస్సులను కొనుగోలు చేసి వాటికి రంగులు దిద్ది కొత్త బస్సుల మారుస్తున్నారు. దీనిపై కూడా రవాణా అధికారులు దృష్టి సారించాలి. ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు విధులకు హాజరయ్యే డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించిన తర్వాతనే బస్సులు అప్పగించాలి.. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే ఆయా పాఠశాలల గుర్తింపుని సైతం రద్దు చేయాలి.

**ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం: జిల్లా రవాణా అధికారి వెంకటరమణ**

మద్యం సేవించి స్కూల్ బస్సులు నడిపిన డ్రైవర్లపై చర్యలు తీసుకుంటాం. చట్ట ప్రకారం చర్యలు తీసుకుని సదరు డ్రైవర్ల లైసెన్సును రద్దు చేయడం జరుగుతుంది. సంబంధిత పాఠశాలల యాజమాన్యాలపై చర్యల కోసం జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిస్తాం. పాఠశాలల యాజమాన్యాలు కూడా ఈ విషయంపై శ్రద్ధ తీసుకోవాలి. విధులకు హాజరయ్యే డ్రైవర్లు మద్యం సేవించారా లేదా అని చెక్ చేసిన తర్వాతనే బస్సులు అప్పగించాలి. మా శాఖ తరపున లైసెన్స్ రద్దు చేస్తాము. ఇంకేమైనా యాక్షన్ ఉంటే అది పోలీసులు చూస్తారు. ఇకనుంచి అన్ని ప్రైవేట్ స్కూల్ కళాశాలల బస్సులను తనిఖీ చేయడం జరుగుతుంది. ఫిట్నేస్ లేని బస్సులు నడిపితే యాక్షన్ సీరియస్ గా ఉంటుంది.

# గోదావరి పుష్కరాలే టార్గెట్..!

## మొదటి పేజీ తరువాయి..

దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాత సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో జిల్లా అధికారులతో భూముల రీసర్వే, అటవీ-రెవెన్యూ సమస్యలు, పోడు భూములు, శ్రీనివాసగుట్ట అభివృద్ధిపై సమగ్ర సమీక్ష చేపట్టారు.భద్రాచలం దేవస్థానం పునరుద్ధరణ పనులు వచ్చే గోదావరి పుష్కరాలకు 15 రోజుల ముందే పూర్తికావాలని మంత్రి స్పష్టమైన గడువు విధించారు. పనుల్లో జాప్యం ఏమాత్రం సహించబోమని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం ఇప్పటికే రూ.351 కోట్లతో ఆలయ పునరుద్ధరణ పనులకు ఆమోదం తెలిపిందని, ఆలయ విస్తరణకు అవసరమైన భూసేకరణ కోసం మరో రూ.75 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీరామనవమి రోజున ఈ మహా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన విషయాన్ని గుర్తు చేశారు.పనుల పర్యవేక్షణ కోసం ఇంజినీరింగ్ శాఖ నుంచి ప్రత్యేక అధికారిని వెంటనే నియమించాలని దేవాదాయ కమిషనర్‌కు ఫోన్‌లోనే మంత్రి ఆదేశించారు. అలాగే దేవాదాయ శాఖ కమిషనర్ ప్రతి పది రోజులకు ఒకసారి భద్రాచలం వచ్చి పనుల పురోగతిని ప్రత్యక్షంగా సమీక్షించాలని సూచించారు.భక్తులకు ఇబ్బందులు కలగకుండా దశలవారీగా పనులు చేపట్టాలని, దర్శనం, క్యూ లైన్లు, తాగునీరు, పారిశుద్ధం, భద్రత వంటి సేవల్లో ఎలాంటి అంతరాయం రాకూడదని స్పష్టం చేశారు. ఆలయ ఉత్తర భాగంలో నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి వేగంగా పూర్తి చేయాలని, డ్రాయింగ్‌లు, డిజైన్‌లు, సాంకేతిక అనుమతుల్లో జాప్యం ఉండరాదని ఆదేశించారు.అవసరమైతే ప్రస్తుతం ఉన్న కార్మికుల కంటే 25 శాతం అదనపు కార్మికులను నియమించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. రిటైనింగ్ వాల్స్, కాంక్రీట్ నిర్మాణాలు, మౌలిక వసతుల పనులు గడువులో పూర్తిచేయాలని చెప్పారు. ఆలయ ప్రాచీన వైభవానికి భంగం కలగకుండా ఆగమశాస్త్ర నిపుణుల పర్యవేక్షణలోనే పనులు కొనసాగించాలని, రాతి నిర్మాణాలు, శిల్పకళా పనులను అనుభవజ్ఞులైన శిల్పులతోనే చేపట్టాలని ఆదేశించారు.పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త స్నాన ఘాట్లు, యాత్రికుల వసతులు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేయాలని మంత్రి సూచించారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుకను చట్టబద్ధంగా అందుబాటులో ఉండే ప్రాంతాల నుంచి సకాలంలో సరఫరా చేస్తామని జిల్లా కలెక్టర్ అంకిత్ హామీ ఇచ్చారు.అనంతరం సారపాకలో జరిగిన సమీక్షలో జిల్లాలో 70 గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వే పనులపై మంత్రి ఆరా తీశారు. ప్రస్తుతం 14 గ్రామాల్లో పనులు కొనసాగుతుండగా, ఐదు గ్రామాల్లో పూర్తయ్యాయని అధికారులు వివరించారు.

మిగిలిన గ్రామాల్లో కూడా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.పాల్వంచలో రీసర్వే పనుల జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, ఆలస్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. రీసర్వే పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని, అవసరమైన సర్వేయర్లు, రోవర్ పరికరాలు, సాంకేతిక సిబ్బందిని సమకూర్చాలని సూచించారు. అటవీ-రెవెన్యూ భూ వివాదాల పరిష్కారానికి రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి ఆదేశించారు. ప్రతి నెలా సమీక్ష నిర్వహించి పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. కొత్తగా పోడు సాగు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, గతంలో పోడు సాగు చేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా మానవీయ కోణంలో పరిష్కరించాలని చెప్పారు.పాల్వంచ శ్రీనివాసగుట్టను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునేలా రహదారి నిర్మాణంతో పాటు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.మంత్రి పర్యటనలో ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్,ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, దేవస్థానం ఈవో దామోదర్ రావు, అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు, దేవాదాయ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# భట్టి మార్క్..

## మొదటి పేజీ తరువాయి..

ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం విద్యా ర్థులకు వరంగా మారింది. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందుబాటులోకి రావడంతో పాటు, మధిర విద్యా రంగంలో ఇది చారిత్రాత్మక మైలు రాయిగా నిలవనుంది.ఇదే సమయంలో ఇల్లందు నియోజకవర్గంలోని కామేపల్లి మండలంలో ఉప ముఖ్యమంత్రి విస్తృ తంగా పర్యటించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అడవి మద్దులపల్లి గ్రామంలో రూ.2.85 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి భూమిపూజ చేశారు. అనంతరం రూ.3.95 కోట్లతో తాళ్లగూడెం-నర్సయ్యకుంట బీటీ రహదారి, రూ.5 కోట్లతో ఆర్‌!!బీ రోడ్డు నుంచి కామేపల్లి స్మశాన వాటిక వరకు బీటీ రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ పనులు పూర్తయితే విద్యుత్ సరఫరా మరింత మెరుగుప డటంతో పాటు గ్రామీణ రహదారుల అనుసంధానం బలోపేతం అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# రూ. 1000 కోట్ల వ్యాపార మార్కును అధిగమించిన భద్రాద్రి బ్యాంక్

**ఖమ్మం జూలై 19, ప్రభాతవార్త**

స్థానిక డాబాల బజార్‌లోని వాసవి కళ్యాణ మండపంలో భద్రాద్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 29వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సభకు బ్యాంకు వాటాదారులు, పురప్రముఖులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు.బ్యాంకు సాధించిన ప్రగతి ప్రస్థానం (ఆర్థిక నివేదిక):సమావేశంలో చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను, బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ్యులు కరతాళ ధ్వనుల మధ్య ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి బ్యాంకు చరిత్రలో తొలిసారిగా రూ. 1000 కోట్లకు పైగా వ్యాపారాన్ని నమోదు చేసి సరికొత్త రికార్డు సృష్టించిందని,తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం సహకార బ్యాంకుల వ్యాపారంలో భద్రాద్రి బ్యాంక్ 5 శాతం వాటాను కైవసం చేసుకుందని తెలిపారు.2026 మార్చి 31 నాటికి బ్యాంకు డిపాజిట్లు రూ. 629.06 కోట్లకు, రుణాలు రూ. 401.10 కోట్లకు చేరాయని, గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రూ. 151.39 లక్షల నికర లాభాన్ని




ఆర్జించి రుణాల వితరణ వసూళ్లలో బ్యాంకు ముందంజలో ఉందని అన్నారు.గత ఏడాది 4 కొత్త శాఖలను ప్రారంభించామని, ఇందులో భాగంగా తొలిసారిగా హైదరాబాద్‌లో బ్రాంచ్‌ను నెలకొల్పినట్లు తెలిపారు. తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా ఎటువంటి ఆటంకాలు లేకుండా, కస్టమర్ల నమ్మకాన్ని చూరగొంటూ 25 శాఖలతో వెయ్యి కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహించడం భద్రాద్రి బ్యాంకు సాధించిన గొప్ప విజయమని అభినందించారు. ఈ కార్యక్రమంలో పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ ఖమ్మం సుడా చైర్మన్, అంబికా కృష్ణ మాజీ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర టీ. ఎస్, సహకార శాఖ జాయింట్ రిజిస్ట్రార్ గట్టు గంగాధర్, రిసెప్షన్ కమిటీ సభ్యులుగా వైస్ చైర్మన్లు సన్నె ఉదయ్ ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వర రావు, బ్యాంకు డైరెక్టర్లు దేవత రాజారావు, మద్ది పిచ్చయ్య, రాజ్ పురోహిత్ చెన్ సింగ్, వై.వి.యస్. రావు, రంగా నాగ శ్రీనివాస రావు, దారా జీవన్ రాం, కర్లపూడి నర్మద, కొపిలవాయి జయప్రద, బోర్డ్ ఆఫ్ మేనేజ్మెంట్ సభ్యులు, వివిధ శాఖల మేనేజర్లు, పాల్గొన్నారు.

# రహదారి మౌలిక సదుపాయాలు బలోపేతంతో ప్రజలకు అందుబాటులోకి మెరుగైన రవాణా సౌకర్యాలు

## నాణ్యమైన విద్యుత్ సేవలను ప్రజలకు అందించటమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

## కామేపల్లి మండలం లో అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శ్రీకారం

*కామేపల్లి, జూలై 19 ప్రభాతవార్త:*

ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.అడవి మద్దులపల్లి గ్రామంలో రూ. 2.85 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33/11 కె.వి.విద్యుత్ ఉపకేంద్రానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించా రు.ఈ ఉపకేంద్రం ద్వారా ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మరింత నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందే అవకాశం కలగ నుంది.అనంతరం రూ.3.95 కోట్ల వ్యయంతో తాళ్లగూడెం నుంచి నర్సయ్యకుంట వ రకు (యం.పి.పి.యస్. పాఠశాల మీదుగా) చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.అదే వి ధంగా రూ.5 కోట్ల అంచనా వ్యయంతో ఇల్లందు ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి కా మేపల్లి స్మశాన వాటిక వరకు కామేపల్లి పెద్ద చెరువు మీదుగా నిర్మించనున్న బీటీ రహదారి పనులను ప్రారంభించారు.ఈ అభివృద్ధి పనుల ద్వారా విద్యుత్, రహదారి మౌళిక సదుపాయాలు మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటు లోకి వస్తాయని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్,టీజీ ఎన్పిడిసిఎల్ ఎండి వరుణ్ రెడ్డి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు, కామేపల్లి సొసైటీ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ,మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు,రాయల నాగేశ్వరరావు,బి. రాంబాబు,టీజీ ఎన్పి డిసిఎల్ డైరెక్టర్ వి.మోహన్ రావు, సిఐ రాజు చౌహాన్, ఎస్ఐ ఇనుగుర్తి శ్రీనివాస చారి, పీఆర్ ఎస్ఇ జి.వెంకట్ రెడ్డి,ఇఇ మహేష్ బాబు,కామేపల్లి తహసీల్దార్ కె.వి శ్రీనివాస రావు,ఎంపీడీవో ధారావత్ సోమలాల్, ఏ డి ఏ కొంగర వెంకటేశ్వరరావు, ఏవో బి.తారా దేవి,మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు,జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి షేక్ ఫత్తే మహమ్మద్, జిల్లా నాయకులు తోటకూరి శివయ్య, సర్పంచ్పడిగ నాగమణి, జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు బానోత్ సుజాత, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రెడబోతు గోపిరెడ్డి,మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మ య్య, నల్లమోతు వెంకట నరసయ్య, మద్దిన్ని నరసింహారావు,జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు అరేమ్ రవి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుగులోత్ గబ్రు నాయక్,గట్టి కొప్పుల నారాయణరెడ్డి, ఇమ్మడి రామనాథం, ఆదెర్ల లక్షీ మ్మనారాయణ,ట్రాన్స్ కో ఏఈ ఎన్ .శ్రీనివాసులు, సర్పంచ్ లకావత్ సునీత తదితరులు పాల్గొన్నారు.కాగా కామేపల్లి మండల పర్యటనకు విచ్చే సిన డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క కు ప్రజలు, రైతులు,కాంగ్రెస్ పార్టీ శ్రేణు లు, గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలి కారు.మద్దులపల్లి సర్పంచ్ పడిగ నాగమణి,మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రెడ బోతు గోపిరెడ్డి,ఆదెర్ల లక్షీ మ్మనారాయణ,శాలువా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు, కామేపల్లి సొసైటీ చైర్మన్ పుచ్చకాయ ల వీరభద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం కు భారీగా జనం తరలి రావ డంతో డిప్యూటీ సీఎం మండల పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కోకుండా సింగరేణి సిఐ ఎన్.సాగర్, స్థానిక ఎస్సై పి.శ్రీకాంత్ సారధ్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.



# 104 ఏళ్ల వృద్ధురాలి కన్నీటి విజ్ఞప్తి..!

### నా భూమి నాకు ఇప్పించండి

### సర్వే నంబర్310 భూమిపై ఆక్రమణ ఆరోపణలు

### 1965 నాటి కొనుగోలు పత్రాలు, వారసత్వ ఆధారాలు మీడియా ముందుంచిన కుటుంబ సభ్యులు

### ప్రజాదర్బార్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి..

### అయినా దక్కని న్యాయం

*ప్రభాత వార్త ఖమ్మం రూరల్,*

ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామానికి చెందిన 104 ఏళ్ల వెలుతురు భద్రమ్మ తన కుటుంబ వారసత్వ భూమిని తిరిగి ఇప్పించాలని కోరుతూ ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో భావోద్వేగానికి గురయ్యారు. తన భర్త వెలుతురు చిన్న వెంకయ్య 1965లో కొనుగోలు చేసిన సర్వే నంబర్310లోని భూమిని కొందరు అక్రమంగా కబ్జా చేసి, దొంగ పత్రాల ఆధారంగా తమదేనంటూ హక్కు చెలాయిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ సందర్భంగా భద్రమ్మ కుటుంబ సభ్యులు 1965 నాటి కొనుగోలు పత్రాలు, సర్వే రికార్డులు, వారసత్వ ధ్రువపత్రాలు, ఇతర సంబంధిత ఆధారాలను విలేకరుల ఎదుట ప్రదర్శించి, వాటి ప్రతులను మీడియా ప్రతినిధులకు అందజేశారు. తమ వద్ద ఉన్న పత్రాలన్నీ చట్టబద్ధమైనవేనని, అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. భద్రమ్మ మనవడు వెలుతురు వీరకుమార్ మాట్లాడుతూ, తన తండ్రి అనారోగ్యంతో మరణించిన తర్వాత కుటుంబ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు భూమిని అక్రమంగా తమ పేర్లకు మార్చుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం దొంగ పత్రాలు చూపిస్తూ భూమిని ఆక్రమించుకుని, తాము భూమి వద్దకు వెళ్లిన ప్రతిసారి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూ వివాదంపై ఇప్పటికే రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్వహిస్తున్న ప్రజాదర్బార్లో భద్రమ్మ కుటుంబ సభ్యులు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. వృద్ధురాలి పరిస్థితిని స్వయంగా మంత్రికి వివరించి, 1965 నాటి కొనుగోలు పత్రాలు, వారసత్వ ఆధారాలను చూపించినట్లు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మంత్రి సంబంధిత రెవెన్యూ అధికారులకు విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు సమస్యకు పూర్తి పరిష్కారం లభించలేదని, అందుకే మరోసారి మీడియా ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా వెలుతురు భద్రమ్మ కన్నీటి పర్యంతమై మాట్లాడుతూ, "నా కొడుకుని పోగొట్టుకున్నాను... ఇప్పుడు నా మనవళ్లను కూడా పోగొట్టుకునే పరిస్థితి రావొద్దు. నాకు 104 ఏళ్లు. నడవడమే కష్టంగా ఉంది. ఈ వయసులో కలెక్టర్ కార్యాలయం, ఎమ్మార్వో కార్యాలయం, అధికారుల చుట్టూ తిరగాల్సి న పరిస్థితి వచ్చింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారిని కూడా కలిసి మా గోడు చెప్పాం. ప్రజాదర్బార్లో వినతిపత్రం ఇచ్చాం. అధికారులు న్యాయం చేస్తారని ఎదురుచూస్తున్నాం. నా ప్రాణం ఉన్నప్పుడే మా భూమి మాకు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి" అంటూ వేడుకున్నారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు సర్వే నంబర్310 భూమిపై సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలు వెలికితీసి అక్రమ కబ్జాదారుల నుంచి తమ భూమిని తిరిగి అప్పగించాలని భద్రమ్మ కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. 104 ఏళ్ల వయసులోనూ న్యాయం కోసం ఒక వృద్ధురాలు చేస్తున్న ఈ పోరాటం..



# నేరాలు-దారుణాలు

## వైభవంగా రామయ్య నిత్య కళ్యాణం

*భద్రాచలం కల్చరల్ ప్రభాతవార్త జూలై 19:*

భద్రాద్రి, శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఆదివారం ఘనం గా ఆలయ పండితులు నిర్వహించారు. ఈ పవిత్ర వేడుకలో ముందుగా మూలవరులకు అభిషేకం మరియు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు అలంకరించి సీతారామచంద్ర స్వామి వారి దివ్య కళ్యాణాన్ని వేదిక సాంప్రదాయ పద్ధతిలో జరిపించారు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కూడా కళ్యాణ ఘట్టంలో పాల్గొని ఆ దివ్య దంపతుల ఆశీర్వాదాలు పొందారు వేద ఘోషలు మంగళ వాయిద్యాలు నడుమ జైశ్రీరామ్ నామస్మరణ మధ్య ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయగా ఆలయ అధికారులు ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించారు సీతారామచంద్ర స్వాముల వారి నిజ కళ్యాణా న్ని దర్శించి తమ జీవితాల్లో ఆయురారోగ్యాలు సుఖసాంతులు ఐశ్వర్యాలు కలిగించాలని ఆ శ్రీరామచంద్రస్వామివారిని మనసా వాచా కర్మణా కోరుకుంటూ తీర్థప్రసాదాలను తీసుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ పెద్దలు వైదిక సిబ్బంది మరియు ఆలయ అధికారులు అందరూ పాల్గొని కళ్యాణ లడ్డూలు మరియు పులిహోర ప్యాకెట్లను అందజేశారు.



# కెప్టెన్ బంజర గ్రామంలో రోడ్డు మరమ్మతుల కోసం ఉప ముఖ్యమంత్రికి ఆరెం రవి దంపతులు వినతి

*కామేపల్లి, జూలై 19 ప్రభాతవార్త:*

కామేపల్లి మండలం కెప్టెన్ బంజర సర్పంచ్ ఆరెం అచ్చమ్మ,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆరెం రవి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలో పర్యటిస్తున్న సందర్భంగా



మార్గమధ్యంలో కలిసి కెప్టెన్ బంజర గ్రామం లోని దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.ఉప ముఖ్యమంత్రి కి పూలదండతో ఘనంగా స్వాగతం పలికి వినతిపత్రాన్ని సమర్పించారు.గ్రామ ప్రజల ఇబ్బందులను వివరించి,రోడ్ల మరమ్మతు పనులను అత్యవసరంగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌ డ్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య,వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, తెలంగా ణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి,సొసైటీ చైర్మన్ పుచ్చ కాయల వీరభద్రం,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా పార్టీ కార్యదర్శి షేక్ ఫత్తే మహమ్మద్, జిల్లా నాయకులు తోటకూరి శివత్యదితరులు పాల్గొన్నారు.

# జై శ్రీరామ్ నామస్మరణతో గోదావరి హారతి వైభవం

భద్రాచలం కల్చరల్, జూలై 19 (ప్రభాతవార్త):

- ఆషాఢ శుద్ధ పంచమి సందర్భంగా భద్రాచలంలో భక్తుల కోలాహలం
- 108 ప్రమిదల దీపోత్సవం..
- వేద మంత్రోచ్ఛారణల మధ్య నదీమాతకు మహామంగళహారతి





పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో ఆషాఢ మాసం శుద్ధ పంచమి సందర్భంగా గోదావరి మాతకు నిర్వహించిన నదీహారతి కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో అత్యంత వైభవంగా జరిగింది. గోదావరి కరకట్టలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తుల జైజైధ్వానాలు, వేదమంత్రోచ్ఛారణలు, భక్తిగీతాల మధ్య గోదావరి హారతి కన్నులపండువగా సాగింది. ఈ సందర్భంగా పురోహితులు రామవజ్జల రవికుమార్ మాట్లాడుతూ, శ్రీ సీతారామచంద్రస్వామి కొలువై ఉన్న భద్రాచలం గోదావరి తీరంలో ఆషాఢ శుద్ధ పంచమి రోజున గోదావరి మాతకు, స్వామివారికి హారతులు సమర్పించడం అత్యంత పుణ్యప్రదమని తెలిపారు. ఈ హారతి ద్వారా ప్రజలకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, శాంతి, సుభిక్షాలు కలుగుతాయని పేర్కొన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ముందుగా గణపతి పూజ నిర్వహించి, 108 ప్రమిదలతో దీపోత్సవం నిర్వహించారు. అనంతరం గోదావరి మాతకు అష్టోత్తర శతనామార్చన, శ్రీరామ అష్టోత్తర పారాయణం నిర్వహించగా, భక్తులు "ఓం శ్రీరామాయ నమః" అంటూ 108 సార్లు శ్రీరామనామాన్ని జపించారు. ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామివారికి 12 సార్లు, అనంతరం గోదావరి మాతకు 21 సార్లు మహామంగళహారతి సమర్పించారు. ప్రతి ఆదివారం లోకకళ్యాణార్థం నిర్వహిస్తున్న ఈ నదీహారతి కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని గోదావరి మాత ఆశీస్సులు, శ్రీరాముని అనుగ్రహం పొందాలని పురోహితులు కోరారుఈ కార్యక్రమంలో పురోహితులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు




## గిరిజన దర్బార్‌కు అధికారులు తప్పనిసరిగా హాజరు

### -సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులతో రావాలని గిరిజనులకు ఐటీడీఏ పిలుపు

భద్రాచలం, జూలై 19 (ప్రభాతవార్త):



నేడు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశించారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గిరిజనులు తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించారు. సంబంధిత శాఖల యూనిట్ అధికారులు ఉదయం 10:30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గిరిజనుల సమస్యలను నేరుగా విని, వేగంగా పరిష్కరించేందుకు గిరిజన దర్బార్‌ను వేదికగా వినియోగించుకోవాలని ప్రాజెక్టు అధికారి కోరారు.

# పూరి గుడిసెల్లో నివసించే ప్రతి పేదవారి సొంతింటి కల నెరవేరుస్తాం

ప్రతి మారుమూల గ్రామానికి బీటీ రోడ్ల నిర్మాణం చేపడతాం

మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి

బూర్గంపహాడ్, ప్రభాతవార్త:





పూరి గుడిసెల్లో ఉంటున్న ప్రతి పేదవారి సొంతింటి కలను నెరవేర్చే బాధ్యత ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకుందని తెలంగాణ రాష్ట్రం రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మాత్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బూర్గంపహాడ్ మండల పరిధిలోని మొరంపల్లి బంజర గ్రామంలో ఆదివారం ఆవుల రమణ దంపతుల ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించారు . అనంతరం పినపాక పట్టి నగర్ గ్రామం నుండి ఉప్పుసాక వెళ్లే మార్గానికి రెండు కోట్ల 20 లక్షల రూపాయల వ్యయంతో బీటి రోడ్డు నిర్మాణానికి పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు ఐటీడీఏ పీవో బి రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పినపాక నియోజకవర్గం అభివృద్ధికి కావాల్సినన్ని నిధులు అందిస్తున్నామని అన్నారు. పేదవాడి సొంతింటి కల నెరవేరడానికి రాష్ట్రంలో పూరి గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు వందశాతం అన్ని కులాల వారికి ఇల్లు కట్టిస్తామని అలాగే రైతులు రాజులు చేయడానికి రెండు పంటలకు రైతు భరోసా అందిస్తున్నామని అన్నారు. పినపాక నియోజకవర్గం మొదటి విడతలో 4500 ఇండ్లు ఇచ్చామని అలాగే రెండో విడతలో 2000 ఇందిరమ్మ ఇండ్లు అదనంగా ఇవ్వడానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని, ముఖ్యంగా బూర్గంపాడు మండలానికి 675 ఇండ్లు మంజూరు చేయగా 325 ఇండ్లు పూర్తి చేయడం జరిగిందని, రైతులు పంటలు పండించుకోవడానికి సీతారామ కాలువల ద్వారా దోమల వాగు చెరువుకు నీటిని విడుదల చేసి రెండు పంటలు పండించుకునేలా కృషి చేయడం జరిగిందని దోమల వాగు చెరువును మినీ రిజర్వాయర్ గా తయారు చేయడానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ విద్యా చందన, ఎంపీడీవో జమాల్ రెడ్డి హౌసింగ్ పీడీ శంకర్, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి

### -సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట

భద్రాచలం, జూలై 19 (ప్రభాతవార్త):



భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నేడు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా సకాలంలో హాజరు కావాలని సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భద్రాచలం డివిజన్ పరిధిలోని ప్రజలు భూ సమస్యలతో పాటు వ్యక్తిగత, ప్రజా సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను లిఖితపూర్వకంగా ప్రజావాణిలో సమర్పించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే వినతులను వెంటనే స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు అందరూ ఉదయం 10:30 గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని, ఈ అవకాశాన్ని డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట కోరారు

# భూముల రీసర్వే, అటవీ-రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

భూ రీసర్వే పనుల్లో జాప్యాన్ని ఉపేక్షించేది లేదు

రెవెన్యూ-అటవీ-పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలి

శ్రీనివాసగుట్టను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**సారపాక, ప్రభాతవార్త:** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భూముల రీసర్వే పనుల పురోగతి, అటవీ-రెవెన్యూ భూ సమస్యల పరిష్కారం, పోడు భూముల అంశం, పాల్వంచ శ్రీనివాసగుట్ట అభివృద్ధిపై జిల్లా అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో 70 గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వే పనుల పురోగతిని మంత్రి సమీక్షించారు. అధికారులు జిల్లాలో ప్రస్తుతం 14 గ్రామాల్లో రీసర్వే పనులు కొనసాగుతుండగా, వాటిలో ఐదు గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని వివరించారు. మిగిలిన గ్రామాల్లో కూడా నిర్ణీత గడువులో రీసర్వే పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. పాల్వంచలో కొనసాగుతున్న సర్వే పనుల పురోగతిపై మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసి చాలా కాలం గడిచినా పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. రీసర్వే పనుల్లో జాప్యాన్ని, పొరపాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పనుల్లో జాప్యానికి గల కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూముల రీసర్వే ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని మంత్రి సూచించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న సర్వేయర్లు, రోవర్ పరికరాలు, వాటి వినియోగం, సాంకేతిక సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకుని అవసరమైన చోట అదనపు వనరులు సమకూర్చాలని సూచించారు. అటవీ-రెవెన్యూ భూ సమస్యల పరిష్కారంపై మంత్రి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలను పోలీస్ శాఖ వారు గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ఉన్న భూ వివాదాలు, అటవీ-రెవెన్యూ సమస్యలను సామరస్యపూర్వకంగా, చట్టబద్ధంగా పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. ప్రతి నెలా సమీక్ష సమావేశాలు నిర్వహించి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పోడు భూముల అంశంపై మాట్లాడుతూ, కొత్తగా పోడు సాగు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గతంలో పోడు సాగు చేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా, మానవీయ కోణంలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పాల్వంచలోని శ్రీనివాసగుట్ట అభివృద్ధిపై మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. శ్రీనివాసగుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునే విధంగా రహదారి నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే శ్రీనివాసగుట్ట ప్రాంతాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేలా సమగ్ర ప్రణాళిక రూపొందించి, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లాలో భూముల రీసర్వే, అటవీ-రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను మంత్రికి వివరించారు. జిల్లాలో దశలవారీగా రీసర్వే పనులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం 14 గ్రామాల్లో పనులు చేపట్టగా ఐదు గ్రామాల్లో పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా నిర్ణీత గడువులో సర్వే పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామని చెప్పారు. రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖల సమన్వయంతో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, కొత్తగూడెం ఆర్డీవో మధు, డివిజనల్ అటవీ అధికారులు, రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖల అధికారులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన హక్కుల సాధనకు కదలాలి

**ఏజెన్సీ చట్టాల పటిష్టంకోసం సమష్టిగా ఉద్యమించాలి**
**పోడు సాగుదారులపై దాడులు, నిర్బంధాలను ప్రతిఘటించాలి**
**అఖిలభారత ఆదివాసి మహాసభ ఇంచార్జి అని రాజా**
**ముగిసిన టీజీఎస్ రాష్ట్ర తృతీయ మహాసభలు**





**కొత్తగూడెం, జూలై 19 ప్రభాతవార్త:** గిరిజన హక్కుల సాధనకు, ఏజెన్సీ చట్టాల పరిరక్షణకు గిరిజన లోకం ఐక్యంగా కదలాల్సిన అవసరం ఉందని అఖిలభారత ఆదివాసి మహాసభ ఇంచార్జి అని రాజా పిలుపునిచ్చారు. తెలంగాణ గిరిజన సమాఖ్య (టీజీఎస్) రాష్ట్ర తృతీయ మహాసభల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసో సియేషన్ హాల్, అమరజీవి సోయం రంగులు నగర్, టాను నాయక్ ప్రాంగణంలో ఆదివారం అత్యంత ఉత్సాహంగా రెండో రోజు ప్రతినిధుల సభ జరిగింది. టీజీఎస్ పతాకాన్ని గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు కల్లూరు వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లా డుతూ... పాలకుల ప్రజావ్యతిరేక విధానాల వల్ల గిరిజన ప్రాంతాల్లో హక్కులు కాలరాయబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తరత రాలుగా అడవిని నమ్ముకుని బతుకుతున్న గిరిజన బిడ్డలను భూములకు దూరం చేసే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. పోడు సాగుదారులకు పూర్తి రక్షణ కల్పించే వరకు, గిరిజన సంక్షేమం సిద్ధించే వరకు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.ఐక్య ఉద్యమాలతోనే గిరిజన హక్కుల రక్షణ, న్యాయం సాధ్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడుతూ పాలకుల అణచివేత వైఖరిని గిరిజన లోకం ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు. గిరిజన భూములపై ఎలాంటి నిర్బంధాలను పెట్టినా సహించేది లేదని, అడవిపై సర్వహక్కులు గిరిజనులవేనని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజా పక్షాన ఉంటూ బలమైన ఉద్యమాలను నిర్మించి గిరిజన బిడ్డలకు పూర్తి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. గిరిజన సమాఖ్య బలోపేతం ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్య మవుతుందని రాష్ట్ర టీజీఎస్ ప్రధాన కార్యదర్శి అంజయ నాయక్ పేర్కొన్నారు. ప్రతినిధుల సభలో ఆయన కార్యదర్శి నివేదికను ప్రవేశ పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కాలంగా గిరిజన హక్కుల కోసం చేసిన ఉద్యమాలను, భవిష్యత్తు కార్యాచరణను నివేదికలో పొందు పరిచామన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పోడు భూముల పట్టాల పంపిణీని తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, విద్యా, వైద్య రంగాల బలో పేతం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రవేశపెట్టిన నివేదికపై ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించి పలు అంశాలపై మహాసభలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పేరుతో సుమారు రెండు లక్షల మంది ఆదివాసీలను జల సమాధి చేస్తున్నారని తరత రాలుగా అడవిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న అమాయకులను అభివృద్ధి పేరుతో అడవుల నుండి దూరం చేసి సహజ వనరులను కొల్లగొట్టేందుకు పాలకలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గిరిజన నాయకులు స్వయం గంగులు తాను నాయక్ వారసత్వాన్ని పునికి పుచ్చుకొని గిరిజన హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రామ్మూర్తి నాయక్ అంజయ్య నాయక్ సిపిఐ టిజిఎస్ నాయకులు ముత్యాల విశ్వనాథం మేయర్ మూడ్ గణేష్ నరాటి ప్రసాద్ సలిగంటి శ్రీనివాస్ కంచర్ల జమలయ్య వి పూర్ణచంద్రరావు అడుసుమిల్లి సాయిబాబా భూక్య దశ్రు ఉప్పుశెట్టి రాహుల్ భూక్య శ్రీనివాస్ సోందే కుటుంబరావు వెంకట్ రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొన్నారు.




చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

**: జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 19 ప్రభాతవార్త:** సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్య లకు సంబంధించిన అంశాలపై లి ఖితపూర్వక ఫిర్యాదు లను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభ మవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధి కారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# కొత్తగూడెం-పాల్వంచ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**రూ.14 కోట్లతో రహదారి విస్తరణకు శంకుస్థాపన**
**జీవో-76పై కూడా త్వరలో స్పష్టత ఇస్తాం...**
**రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**కొత్తగూడెం, జూలై 19 ప్రభాతవార్త:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దమ్మపేట-పాల్వంచ ప్రధాన రహదారిలో జిల్లా ఖనిజ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధుల ద్వారా రూ.14 కోట్ల నిర్మాణ వ్యయంతో సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర రెండు లేన్ల రహదారిని నాలుగు లేన్ల రహదారిగా విస్తరించే పనులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంచికంటి నగర్ హర్ష టౌన్‌షిప్‌లోని ఎస్‌కేటీ అపార్ట్‌మెంట్ నుంచి ప్రధాన రహదారి వరకు రూ.50 లక్షల నిర్మాణ వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి గోదుమవాగు వరకు రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సెంట్రల్ లైటింగ్, డివైడర్ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇవ్వడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. దమ్మపేట-పాల్వంచ రహదారి గత అనేక సంవత్సరాలుగా దెబ్బతిని ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని, పాల్వంచతో పాటు అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల ప్రజలు కూడా ఈ రహదారిపై ఆధారపడుతున్నందున అత్యవసరంగా డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.14 కోట్లను మంజూరు చేసి నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాల్వంచ ప్రాంతంలో భూ సమస్యలు, రిజిస్ట్రేషన్ సమస్యలు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ఇప్పటికే కొన్ని సర్వేలు పూర్తయ్యాయని, మిగిలిన సర్వేలను కూడా వేగవంతంగా పూర్తి చేసి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి తెలిపారు. సింగరేణి పరివాహక ప్రాంతాలకు సంబంధించిన జీవో-76 అంశంపై కూడా ప్రభుత్వం సానుకూలంగా పరిశీలన జరుపుతోందని, త్వరలోనే దీనిపై స్పష్టత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పాల్వంచ పారిశ్రామిక ప్రాధాన్యతను మరింత పెంచేందుకు కాలుష్య రహిత పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కొత్తగూడెం పరిసర ప్రాంతంలో విమానాశయం ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని చెప్పారు. ప్రతి అర్హ కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డుల జారీ వంటి హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న అభివృద్ధి పనులు ఇప్పుడు వేగంగా అమలవుతున్నాయని అన్నారు. కొత్తగూడెం-పాల్వంచ బైపాస్ రహదారి నిర్మాణం, యూనివర్సిటీ అభివృద్ధి, అంతర్జాతీయ స్థాయి స్టేడియం ఏర్పాటు, పాల్వంచలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం, మెడికల్ కాలేజీ, ఎస్పీ కార్యాలయం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పేరును "కొత్తగూడెం-పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్"గా మార్చే ప్రతిపాదనపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని పేర్కొన్నారు. జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ... జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక తదితర శాఖల సమన్వయంతో ముందస్తు కార్యాచరణ చేపట్టినట్లు మంత్రికి వివరించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, మెట్ట పంటల సాగు, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన వ్యవసాయ విధానాలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, స్థానిక సంస్థలకు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ప్రభుత్వ సేవల్లో నాణ్యతకు నిదర్శనంగా నిలవాలి

## హెచ్‌పీ గ్యాస్ సరఫరాలో గ్యాస్ మేనేజర్

## అనంతులఖికు ఉత్తమ అవార్డు

## అభినందించిన జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 19 ప్రభాతవార్త:** పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం, పాల్వంచ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ హెచ్‌పీసీఎల్ గ్యాస్ కంపెనీ సౌత్ సెంట్రల్ జోన్ నుంచి ప్రతిష్ఠాత్మక ఉత్తమ అవార్డు అందుకోవడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వినియోగదారులకు గృహావసర గ్యాస్ సిలిండర్లను సకాలంలో సరఫరా చేయడం, 99.9 శాతం ఈకేవైసీ పూర్తి చేయడం, 95 శాతం వినియోగ దారుల గృహాల్లో భద్రతా తనిఖీలు నిర్వహించడం, 88 శాతం సురక్ష పైప్‌లు మార్చడం వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడం వంటి అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు హెచ్‌పీసీఎల్ గ్యాస్ కంపెనీ సౌత్ సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. విజయవాడలోని హెచ్‌పీసీఎల్ రిటైల్ రీజనల్ కార్యాలయంలో ఈనెల 17న జరిగిన సౌత్ సెంట్రల్ జోన్ సేల్స్ ఆఫీసర్ల సమీక్ష సమావేశంలో ఈ ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఉత్తమ అవార్డు అందుకున్న అనంతుల లక్ష్మీనారాయణను జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ త్రినాథ్ బాబులు అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సేవల్లో అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు తప్పకుండా లభిస్తుందని అన్నారు. వినియోగదారుల సంతృప్తే లక్ష్యంగా పనిచేస్తూ ప్రభుత్వ సంస్థలకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని అనంతుల లక్ష్మీనారాయణ ను కొనియాడారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది రాజులపూడి రజిత, కేలోత్ నరేష్, దుర్గం రాజాబాపు లను కూడా కలెక్టర్ అభినందిస్తూ, ఇదే సమిష్టి కృషిని ఇలాగే కొనసాగించి ప్రభుత్వ సేవలకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# బూటకపు మెడికల్ బోర్డును వెంటనే రద్దు చేసి రీమెడికల్ బోర్డు నిర్వహించాలి

## కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న యాజమాన్యం

## తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మిరియాల రంగయ్య



**కొత్తగూడెం, జూలై 19 ప్రభాతవార్త:** ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన మెడికల్ బోర్డు బూటకపు ప్రక్రియగా జరిగిందని, దానిని వెంటనే రద్దు చేసి గతంలో అమలు చేసిన విధానంలోనే రీ మెడికల్ బోర్డు నిర్వహించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఏఐటియుసి ఇచ్చిన సమ్మె నోటీసు ఫలితంగానే యాజమాన్యం మెడికల్ బోర్డు నిర్వహించేందుకు ముందుకొచ్చిందని, అయితే 17, 18 తేదీల్లో జరిగిన బోర్డు పారదర్శకంగా జరగలేదని కార్మికుల కుటుంబాలకు భవిష్యత్తు లేకుండా చేసారని ఆరోపించారు. ఎంక్వైరీ పేరుతో దళారీల జోక్యం పెరిగిందని పేరుతో యాజమాన్యం కార్మికులను కార్మిక కుటుంబాలను మోసం చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులను ఇన్వాలిడేషన్ చేయకుండా వారి కుటుంబాల జీవితాలతో యాజమాన్యం చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ బోర్డు జాబితాలో పేర్లు ఉన్న పలువురు కార్మికులకు కూడా కనీసం సమాచారం ఇవ్వడంలో అధికారులు విఫలమయ్యారని అన్నారు. మంచానికే పరిమితమైన కార్మికులను, కాళ్ళు చేతులు లేని, గుండెకు స్టెంట్లు పడిన, కిడ్నీలు పనిచేయక యూరిన్ బ్యాగ్ తో ఉన్నవారిని సైతం మెడికల్ బోర్డు పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. సింగరేణి ప్రధాన ఆసుపత్రి వైద్యులకు అనారోగ్యంతో ఉన్న కార్మికుల పరిస్థితి పూర్తిగా తెలుసని, అలా ఉన్న కార్మికులను గతంలో ముఖ్య వైద్యాధికారి పరిధిలోనే ఇన్వాలిడేషన్ చేసిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాంటి విధానాన్ని పక్కనబెట్టి కార్మికులను అనవసరంగా బోర్డుల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదన్నారు. జరిగిన ఈ బోర్డు ను వెంటనే రద్దుచేసి గతంలో అమలు చేసిన విధంగానే మెడికల్ బోర్డు తక్షణమే నిర్వహించి అనారోగ్యంతో ఉన్న అర్హులైన కార్మికులను ఇన్వాలిడేషన్ చేసి వారి వారసులకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించి కార్మిక కుటుంబాలకు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. అలాగే మెడికల్ బోర్డుకు ఉన్న రెండేళ్ల కాలపరిమితి నిబంధనను తొలగించి, అనారోగ్యంతో సిక్‌లో ఉన్న కార్మికుడు బోర్డు కు దరఖాస్తు చేసుకున్న వెంటనే ఇన్వాలిడేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. సుమారు 2000 మంది కార్మికులు మెడికల్ బోర్డ్ కై ఎదురుచూస్తున్నారని వీరికి వెంట వెంటనే నెలకు 2 సార్లు బోర్డ్ నిర్వహించి ఇన్వాలిడేషన్ చేయాలని డిమాండ్ చేశారు. మేము ప్రభుత్వాన్ని ఒప్పించామని గొప్పలు చెప్పుకున్న ఐ ఎన్ టీ యు సి సంఘం కార్మిక వర్గానికి సమాధానం చెప్పాలి. ప్రభుత్వాన్ని సాకుగా చూపుతూ యాజమాన్యం కాలయాపన చేయవద్దని హెచ్చరించిన ఆయన, కార్మికులకు న్యాయం జరగకపోతే సింగరేణి వ్యాప్తంగా ఏఐటియుసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

# రాష్ట్ర అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా కు ఏడు పతకాలు

**కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూలై 19 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్‌లోని, ఇందిరాగాంధీ స్టేడియంలో నిన్నటితో ముగిసిన రాష్ట్ర అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు ప్రతిభ కనబర్చి మొత్తం ఏడు పతకాలు సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహీధర్ తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రెండు బంగారు, రెండు రజత, మూడు కాంస్య పతకాలు గెలుచుకుని జిల్లాకు గర్వ



కారణంగా నిలిచారు. విజేతలు: పాల్వంచకు చెందిన పి. హర్షిత – 5000 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకం. కాచనపల్లికి చెందిన ఈ. విజయ దుర్గ – ట్రయథ్లాన్ గ్రూప్‌సి విభాగంలో బంగారు పతకం. ఈ. సమీరా – ట్రయథ్లాన్ గ్రూప్‌ఎ విభాగంలో రజత పతకం. వి. వెన్నెల – ట్రయథ్లాన్ గ్రూప్‌బి విభాగంలో రజత పతకం. వి. విశ్వప్రశాంతి – ట్రయథ్లాన్ గ్రూప్‌సి విభాగంలో కాంస్య పతకం.




అంకంపాలెంకు చెందిన తాటి వర్షిత – 10,000 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం. సున్నం శైలు – 1,500 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అధికారి ఎం. పరంధామ రెడ్డి విజేతలను, అథ్లెటిక్స్ కోచ్‌లు పి. నాగరాజు, పి. నాగేందర్, పవన్లను వారి కృషికి ప్రత్యేకంగా అభినందించారు.




**పాల్వంచ, ములకలపల్లి, లక్ష్మిదేవిపల్లి, చండ్రుగొండ**

# ఘనంగా శ్రీ హతిరామ్ బావాజీ జయంతి వేడుకలు

**కొత్తగూడెం టౌన్, జూలై 19 ప్రభాతవార్త:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం నందాతండా గ్రామపంచాయతీ పరిధిలోని బృందావనం గుట్టపై ఉన్న సుమారు 175 ఏళ్ల పురాతన శ్రీ హతిరామ్ బావాజీ ఆలయంలో లంబాడీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ హతిరామ్ బావాజీ 597వ జయంతి, భోగ్ భండారో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది బాణోత్ రమేష్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, డాక్టర్ బీఎస్ రావు, కార్పొరేటర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హతిరామ్ బావాజీ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి అత్యంత ప్రియ భక్తుడని, ఆయనకు సంబంధించిన చారిత్రక విశేషాలు లంబాడీలకు గర్వకారణమని అన్నారు. అలాగే ఈ పురాతన ఆలయానికి రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించాలని, బృందావనం గుట్ట ఆక్రమణలకు గురికాకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సంత్ సాదువుల సమక్షంలో ప్రత్యేక పూజలు, భోగ్ భండారో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, ఆలయ ట్రస్ట్ సభ్యులు, వివిధ లంబాడీ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, భక్తులు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

## మంత్రి పొంగులేటికి విలేకరుల వినతి



**చుంచుపల్లి, జూలై 19 ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాల్లో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆదివారం జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. జిల్లా పర్యటనలో భాగంగా చుంచుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి, ఎన్నో ఏళ్లుగా ఇళ్లస్థలాల కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులకు సొంత ఇల్లు కూడా లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. గతంలో రామవరం వంతెన సమీపంలో 10 ఎకరాల స్థలాన్ని జర్నలిస్టుల ఇళ్లస్థలాల కోసం కేటాయించినప్పటికీ, కొన్ని అనివార్య కారణాలతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందని గుర్తు చేశారు. అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరితగతిన ఇళ్లస్థలాలు కేటాయించి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో కల్లోజి శ్రీనివాస్, వీరు నాయక్, వట్టికొండ రవి, నాగచంద్ర, ప్రవీణ్, పాపారావు, పురం శ్రీనివాస్, తారక్, రాజేందర్, బాబు, షఫి, దశరథ్ రజువా, ఎ. మనోజ్ కుమార్, ఎన్. రాజేష్, దుర్గ, ఎం. రాజేష్, సురేష్, రవి, నాగేశ్వరరావు, సంతోష్, నరేష్, పురుషోత్తం, నవీన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఇంజనీరింగ్ కళాశాల మంజూరు ఈ ప్రాంత యువతకు వరం

### నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా డిప్యూటీ సీఎం కృషి

### మధిర ఎడ్యుకేషనల్ మణిహారంలోకి మెడికల్ కాలేజీ కావాలి

### (విలేకరుల సమావేశంలో నాయకులు ప్రజాప్రతినిధులు)



**మధిర జూలై 19 ప్రభాతవార్త** నియోజకవర్గానికి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల మంజూరు కావడం ఈ ప్రాంత యువత కు వరం లాంటిదని నాయకులు ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఆదివారం మధిర ప్రజా భవన్ వద్ద నియోజకవర్గ పరిధిలోని పార్టీ ముఖ్య నాయకులు సర్పంచు లు కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులతో కలిసి మండల అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కళాశాల మంజూరు జీవోను విడుదల చేశారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. మధిర నియోజకవర్గాన్ని సమగ్ర అభివృద్ధి చేసేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేస్తున్న కృషి అనిర్వచ నీయమైనదన్నారు. మధిర ప్రాంతంలో విద్యారంగం వైద్యరంగం వ్యవసాయ రంగాల అభివృద్ధి కోసం మౌలిక వసతుల కల్పనల కోసం కోట్లాది రూపాయల నిధులతో పనులు చేపట్టడం జరుగుతున్నది అన్నారు. ఎడ్యుకేషనల్ హబ్ గా మధిర నియోజకవర్గం తీర్చిదిద్దాలన్న ఆలోచనలో భాగంగా ఈ ప్రాంతానికి అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఐటి హబ్ తోపాటు ప్రస్తుతం ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాలలను కోట్ల నిధులతో అభివృద్ధి చేయడం జరుగుతున్నదన్నారు. నియోజకవర్గంలో 15 ఏళ్ల క్రితం దూర దృష్టితో ఏర్పాటు చేసిన వ్యవసాయ పాలిటెక్నిక్ డిగ్రీ కళాశాల ద్వారా ఎంతో మందికి ఉపాధి లభించిందన్నారు. ఈ ప్రాంతంలో విద్యారంగంలో వైద్య విద్యను అందుబాటులోకి తీసు కొచ్చేందుకు డిప్యూటీ సీఎం కృషి చేయాలని దీని ద్వారా ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న మధిర రాష్ట్రంలోనే విద్యారంగంలో అగ్రగామిగా నిలబడేందుకు దోహదపడుతుందని ఆశ భావం వ్యక్తం చేశారు. మధిర మున్సిపాలిటీ పరిధిలో మండల పరిధిలో నియోజకవర్గంలో పదేళ్ల కాలంలో శాసనసభ్యులుగా ఉన్నప్పటికీ ప్రభుత్వ సహకారం లేకపోవడంతో నిలిచిపోయిన అభివృద్ధిని ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి దిశగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రాజకీయాలకతీతంగా అన్ని పార్టీల సూచనలను సలహాలను తీసుకుంటూ అభివృద్ధికి కృషి చేయడం భట్టివిక్రమార్క పాలనా దక్షతకు నిదర్శనమని అన్నారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు ప్రక్రియ ఆలోచన కు కార్యరూపం దాల్చనుండడంతో మధిర ప్రాంతంలోని పేద బడుగు బలహీన వర్గాల కుటుంబాల తల్లిదండ్రులు యువత హర్షం వ్యక్తం చేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పిసిసి సభ్యులు శీలం ప్రతాపరెడ్డి, జిల్లా నాయకులు కర్నాటి రామారావు, వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, చిట్టిబాబు, ఐలూరు వెంకటేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు, ఏఎంసి చైర్మన్ లు బండారు నరసింహారావు, అంబటి వెంక టేశ్వర్లు అభివృద్ధికమిటీ చైర్మన్ వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ కోన దనికుమార్ మాజీమార్కెట్ కమిటీ చైర్మన్లు చావా రామకృష్ణ రంగా హనుమంతరావు, సీనియర్ నాయకులు సూరంశెట్టి కిషోర్, ఎర్రుపాలెం చింతకాని మండల అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి గోపి యాదవ్ బోనకల్ అధ్యక్షుడు కర్నాటి కోటి, అభివృద్ధి కమిటీ సభ్యులు తన్నీరురామకృష్ణ, రంగ శ్రీను, కౌన్సిలర్లు పలువురు సర్పంచులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక రంగంలో మార్పులు ద్వారా మెరుగైన సమాజం

### పల్లె ప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు

**బోనకల్, ప్రభాతవార్త :** సాంస్కృతిక రంగంలో మార్పులు ద్వారా మెరుగైన సమాజం ఏర్పడుతుందని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన స్టడీ సర్కిల్ లో సాంస్కృతిక రంగంలో మార్పులు అనే అంశంపై ఆయన మాట్లాడారు. కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షత వహిం చారు. ప్రత్యామ్నాయ శ్రామిక జీవన సౌందర్యం వెల్లివిరిసే సమాజంకోసం అభ్యుదయ కవులు, కళాకారులు, రచయితలు పని చేయాలని పల్లా కొండల రావు కోరారు. రాజుల కాలం నుండి కవులు, కళాకారులు, రచ యితలు ఒకే రకంగా లేరన్నారు. నేడు కూడా దోపిడీ శక్తులకు భజన చేసే వారు, వాటిని నిరోధించేందుకు ప్రయత్నం చేస్తున్నవారూ ఉన్నారన్నారు. సమాజంలో సంప్రదాయాలను యథాతథంగా కొనసాగేలా ఉండే కార్యక్రమాలు, సంస్కృతిని కాకుండా ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతిని నిర్మించేందుకు, వాటిని ప్రజలు ఆచరించేలా చైతన్య పరిచేందుకు రచనలు, కళలు దోహదం చేయాలన్నారు. దేశంలో ప్రశ్నించే, ఆలోచింపజేసే, ప్రగతిశీల శక్తులను నిలువరించేందుకు, నిర్బంధించేందుకు పాలకులు కుట్రలు చేస్తున్నారని, వాటిని నిస్సిగ్గుగా బహిరంగంగా సమర్థించే లంపెన్ శక్తులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కళ కల కోసమో, కాసుల కోసమో కాకుండా ప్రజలను జాగృతం చేసేందుకు ఉపయోగ పడాలన్నారు. నేటి కార్పొరేట్ సంస్కృతిలో పాలకులను పొగుడుతూ పాటలు రచించి సంపాదించేవారు, వాటి ఆధారంగా డిజేలతో విష సంస్కృతివైపు యువతను నడిపిస్తున్నశక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువతను ఆలోచించకుండా, ప్రశ్నించకుండా, పోరాటాలవైపు మళ్ళకుండా చేసే సాంస్కృతిక కార్యక్రమాలకు భిన్నంగా ఆచరణలో ప్రత్యామ్నాయ కార్యక్రమాలు, కళలు రూపొందించేందుకు అభ్యుదయ రచయితలు ముందుకు రావాలని, వారిని ప్రజలు కాపాడుకోవాలని, ప్రోత్సాహం అందిం చాలని కోరారు. ఇది జరుగుతుంటే సమాజం మళ్ళీ అంధకారంలోకి నెట్టబడడం ఖాయమన్నారు. ప్రస్తుతం దేశంలో దుర్మార్గమైన, ప్రమాద కరమైన సంస్కృతిని పెంచేందుకు పాలకులు ప్రయత్నం చేస్తుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కిలారు సురేష్, గుగులోతు నరేష్, బొప్పాల రమేష్, చేపూరి వెంకటేశ్వర్లు, కొండేటి అప్పారావు, జొన్నలగడ్డ సునీత, కుక్కల కోటేశ్వరరావు,కూచిపూడి మురళి, కౌసాని సూర్యప్రకాష్ రావు, పిల్లలమర్రి వెంకట అప్పారావు, గండు సైదులు, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్మీడియట్ విద్యాధికారికి ఫిర్యాదు

**కొత్తగూడెం టౌన్, జూలై 19 ప్రభాతవార్త:**

ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇంకా అందలేదనే కారణంతో ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీ.సీ.) ఇవ్వడం లేదని ఆరోపిస్తూ కొత్తగూడెంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలపై విద్యార్థిని జంపాల తేజస్విని, తండ్రి దివంగత లక్ష్మణ్ కుమార్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. తేజస్విని 2024-26 విద్యా సంవత్సరంలో కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూపులో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసింది. ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇంకా కళాశాలకు రాలేదనే కారణాన్ని చూపుతూ యాజమాన్యం టీ.సీ. ఇవ్వడానికి నిరాకరిస్తోందని ఆమె ఆరోపించింది. పలుమార్లు కళాశాల యాజమాన్యాన్ని సంప్రదించినప్పటికీ ఎలాంటి స్పందన లభించలేదని ఫిర్యాదులో పేర్కొంది. ఉన్నత విద్యలో చేరేందుకు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ అత్యవసరమని, వెంటనే టీ.సీ. ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని ఆమె కోరింది.






# రూ.5.50 లక్షల తో సిసి రోడ్డు పనులకు సర్పంచ్ భూమి పూజ

### రాజ్యసభ ఎంపీ రేణుక చౌదరి ఎంపీ లార్డ్స్ నిధులు



**మధిర జూలై 19 ప్రభాతవార్త** మండల పరిధిలోని ఇల్లూరు గ్రామంలో రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి ఎంపీ లార్డ్స్ నిధులనుండి మంజూరైన రూ. 5.50 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ నిధులతో ఇల్లూరు గ్రామంలో ముస్లిం కాలనీలో నూతనంగా సిసి రోడ్డును నిర్మించనున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇల్లూరు గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర మాజీ మంత్రివర్యులు రేణుకా చౌదరి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామాభివృద్ధికి తనదైన తోడ్పాటును కృషిని అందిస్తున్న జవ్వాజి ఆనందరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోటా వీరయ్య వార్డు నెంబర్స్ ముస్లిం పెద్దలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మధిర మున్సిపాలిటీలో అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.62 కోట్లు మంజూరు

**మధిర జూలై 19 ప్రభాతవార్త**

మధిర మున్సిపాలిటీ లో అభివృద్ధి పనులకు రూ 62 కోట్ల నిధులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంజూరు చేశారు. మధిర పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులలో భాగంగా ఒకటో వార్డు నుండి తొమ్మిదవ వార్డు వరకు గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి గాను రూ.17 కోట్లు మంజూరు చేశారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో (సిసి రోడ్ల) అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ 40 కోట్లు మంజూరు చేశారు. అలాగే అవసరమైన చోట డ్రైన్ లో నిర్మాణానికి రూ.5 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక దృష్టితో నిధులు కేటాయించడం పట్ల మున్సిపల్ చైర్పర్సన్ సామినేని సుజాత రామనాథం, వైస్ చైర్మన్ కోనాధని కుమార్, అభివృద్ధి కమిటీ కన్వీనర్ వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

# పి.వి. సింధుకు పల్లపోతు శ్రీనివాసు అభినందనలు

**కొత్తగూడెం టౌన్, జూలై 19 ప్రభాతవార్త:**



జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన భారత స్టార్ షట్లర్ పి.వి. సింధుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హాకీ అసోసియేషన్ చైర్మన్ పల్లపోతు శ్రీనివాసు (వాసు) హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఫైనల్లో జపాన్‌కు చెందిన అకానే యమగూచిపై 2117, 2117 తేడాతో విజయం సాధించి, జపాన్ ఓపెన్ టైటిల్‌ను గెలిచిన తొలి భారత మహిళా షట్లర్‌గా చరిత్ర సృష్టించడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా పి.వి. సింధు భారత క్రీడా రంగానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు.

# అకుంఠిత దీక్షకు చిరునామా

## భద్రాద్రి హరిహర క్షేత్రానికి ఆత్మ శివన్ గురుస్వామి





**భద్రాచలం, ప్రభాతవార్త :** భక్తి అనేది మాటల్లో చెప్పేది కాదు... జీవితాంతం ఆచరించి చూపించేది. అలాంటి మహనీయుల్లో భద్రాద్రి హరిహర క్షేత్ర రూపకర్త శివన్ గురుస్వామి పేరు చిరస్థాయి గా నిలిచిపోయింది. ఇతర రాష్ట్రం నుంచి భద్రాచలానికి వచ్చిన ఓ సాధారణ సన్యాసి... తన తపస్సు, ప్రవచనాలు, సేవా దృక్పథంతో వేలాది మంది భక్తుల జీవితాల్లో ఆధ్యాత్మిక వెలుగులు నింపిన గురువుగా ఎదిగారు.

### భక్తి ప్రచారానికి జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు

1981లో భద్రాచలం చేరుకున్న శివన్ గురుస్వామి, ఆ రోజుల్లో పెద్దగా ప్రచారం లేని అయ్యప్ప స్వామి దీక్షా మహిమలను గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. చిన్న గుడిసెలో నివసిస్తూ స్వార్థం లేకుండా భక్తులకు ప్రవచనాలు చేస్తూ, అయ్యప్ప భక్తి మార్గంలో వేలాది మందిని నడిపించారు.

### హరిహర క్షేత్ర నిర్మాణమే జీవిత లక్ష్యం

"భద్రాద్రిలో అయ్యప్ప ఆలయం ఉండాలి... హరిహర తత్వం వెలుగొందాలి" అనే మహోన్నత సంకల్పంతో 1989లో గౌతమి గోదావరి తీరంలో అయ్యప్ప ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనేక మంది భక్తులను ఒక్క తాటిపైకి తీసుకొచ్చి, వారి సహకారంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అతిపెద్ద హరిహర క్షేత్రానికి రూపం ఇచ్చారు.

### శబరిమల యాత్రకు వేలాది మందికి మార్గదర్శి

ప్రతి ఏడాది భద్రాద్రి ఏజెన్సీ ప్రాంతం నుంచి సుమారు రెండు వేల మందికి పైగా అయ్యప్ప స్వాములకు దీక్ష అందించి, వారిని స్వయంగా శబరిమలకు తీసుకెళ్లి దర్శనం చేయించేవారు. గురుస్వామి వెంట శబరిమల యాత్ర చేయడం భక్తులు తమ జీవితంలో దక్కిన మహాభాగ్యంగా భావించేవారు.

### విగ్రహ ప్రతిష్ఠతో చరిత్ర సృష్టి

1996లో హరిహర క్షేత్రంలో అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠను అత్యంత వైభవంగా నిర్వహించారు. అప్పటి నుంచి ఈ ఆలయం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల అయ్యప్ప భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది.

### మరణానంతరం మరింత పెరిగిన మహిమ

1998లో అనారోగ్యంతో శివన్ గురుస్వామి పరమపదించినా, ఆయన సేవలు, త్యాగం, భక్తి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి. పదునెట్టాంబడి ఎదురుగా గురుస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, అయ్యప్ప స్వామితో పాటు గురుస్వామిని కూడా భక్తులు దర్శించుకోవడం ఈ క్షేత్ర ప్రత్యేకతగా నిలిచింది.





**నేడు 29వ వర్ధంతి సందర్భంగా విశేష పూజలు**

**వెయ్యిమందికి పైగా భక్తులకు అన్నదానం**

**ఒంటరి గుడిసె నుంచి వేలాది భక్తుల హృదయాల వరకు...**

**శివన్ గురుస్వామి ఆధ్యాత్మిక ప్రస్థానం**

**భద్రాద్రిలో అయ్యప్ప భక్తి జ్యోతి వెలిగించిన మహనీయుడు**

**హరిహర క్షేత్ర నిర్మాణం వెనుక గురుస్వామి**

**సంకల్పమే బలమైన పునాది**

**ప్రతి ఏడాది రెండు వేల మందికి పైగా భక్తులకు**

**శబరిమల యాత్ర మార్గదర్శి**

**మరణానంతరం కూడా భక్తుల మనసుల్లో చిరంజీవి...**

**గురుస్వామి విగ్రహానికి నిత్య నమస్కారాలువర్ధంతి కాదు...**

**భక్తి వైభవానికి ప్రతీ ఏడాది జరిగే మహోత్సవం**

### వర్ధంతి కాదు... భక్తి స్మరణోత్సవం

ప్రతి సంవత్సరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురుస్వామి వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. నేడు (20/7/2026) 29వ వర్ధంతి సందర్భంగా గురుస్వామి విగ్రహానికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించడంతో పాటు వెయ్యిమందికి పైగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు.

### ప్రభాతవార్త విశ్లేషణ

కాలం మారింది... భక్తి రూపాలు మారాయి... కానీ శివన్ గురుస్వామి వెలిగించిన ఆధ్యాత్మిక జ్యోతి మాత్రం ఇంకా ఆరిపోలేదు. ఒక వ్యక్తి సంకల్పం, నిస్వార్థ సేవ, అకుంఠిత దీక్షతో ఓ ప్రాంతానికే ఆధ్యాత్మిక గుర్తింపును తీసుకురావచ్చని ఆయన నిరూపించారు. భద్రాద్రి హరిహర క్షేత్రం కేవలం ఓ ఆలయం కాదు... అది గురుస్వామి జీవిత తపస్సుకు నిలువెత్తు నిదర్శనం. నేడు వేలాది అయ్యప్ప భక్తుల నోట వినిపించే "స్వామియే శరణం అయ్యప్ప" నినాదంలో శివన్ గురుస్వామి సేవల ప్రతిధ్వని ఇప్పటికీ స్పష్టంగా వినిపిస్తూనే ఉంది

---

# ప్రజా ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధికి సమ ప్రాధాన్యం

**అశ్వాపురం, మణుగూరు మండలాల్లో రూ. 32 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

**అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు**

**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



**మణుగూరు/ అశ్వాపురం, ప్రభాతవార్త, జూలై 19:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండున్నరేళ్లలోనే సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం పినపాక నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్‌లతో కలిసి అశ్వాపురం, మణుగూరు మండలాల్లో రూ. 32 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ పర్యటన లో భాగంగా ఆయన అశ్వాపురం మండలంలో రూ. 24 కోట్లుతో అశ్వాపురం మొండికుంట మార్గంలోని 18 గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డుకు,రూ. 2.40 కోట్లుతో గొందిగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 16 అదనపు తరగతి గదులులకు, రూ. 20 లక్షల తో అమ్మగారిపల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులకు, మణుగూరు మండలంలో రూ. 2.50 కోట్లుతో లంక మల్లారం గ్రామంలో హై లెవెల్ బ్రిడ్జి రోడ్డు,రూ. 1 కోటి తో గుట్ట మల్లారం, కలివేరు గుంపు పు గ్రామాలకు తారు రోడ్డునిర్మాణం పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.పేదల చిరకాల స్వప్నమైన సొంత ఇంటిని సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్నినిరంతరాయంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పినపాక నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇండ్లతో పాటు అదనంగా 1,000 ఇండ్లు మంజూరు చేశామన్నారు. రెండో విడతలో మరో 2,500 ఇండ్లతో పాటు అదనంగా ఇంకో 2,000 ఇండ్లు మంజూరు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500, రెండో విడతలో 2,000 ఇళ్లు ఇచ్చామని, భవిష్యత్తులో దశలవారీగా ప్రతి అర్హుడైన పేదవాడికి ఇల్లు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాకుండా, చెప్పని అనేక సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రజా ప్రభుత్వం ప్రజల ఇంటి ముంగిటకు తీసుకెళ్తోంది. పేదల సంక్షేమమే మా ప్రభుత్వ ప్రధాన ధ్యేయం అని అన్నారు.

రైతుల సంక్షేమాని అత్యంత ప్రాధాన్యతనిస్తూ రూ. 2 లక్షల వరకు రుణమాఫీని విజయవంతంగా అమలు చేశామని అన్నారు. నిరుద్యోగుల కోసం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 72,000 ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదేనన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూ. 63 కోట్లను సున్నా వడ్డీ రుణాల రూపంలో అందించామన్నారు. గతంలో పేదలకు అందని సన్న బియ్యాన్ని ఇప్పుడు రేషన్ ద్వారా ఇస్తున్నామని, గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డుల ప్రక్రియను మార్చి అర్హులందరికీ కొత్త కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు.

గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తూ 60 పాఠశాలలకు పాఠశాల చొప్పున ఐదు టీవీలను (మొత్తం 300) అందిస్తామని మంత్రి ప్రకటించారు. విద్యార్థుల కోసం 40 శాతం డైట్ చార్జీలు, విద్యార్థినులకు 200 శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచినట్లు వివరించారు. అశ్వాపురం సర్పంచ్ విజ్ఞప్తి మేరకు గ్రామంలో సెంట్రల్ డివైడర్, లైటింగ్ ఏర్పాటుకు త్వరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మంత్రి ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమాల్లో మణుగూరు, అశ్వాపురం మండలాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, భారీ సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల జీతాలు పెంచాలి

**జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ హాస్పటల్ ఏర్పాటు చేయాలి**

**మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి రామయ్య డిమాండ్**

ఖమ్మం అర్బన్ జూలై 18(ప్రభాత వార్త )



ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ కింద ప్రతినెల కార్మికుల యొక్క వేతనాలు నుండి కటింగ్ అవుతున్న కార్మికులకు ఉపయోగపడటం లేదని ఈఎస్ఐ హాస్పిటల్ లేకపోవడం వల్ల కార్మికులు కార్మికులకు జబ్బులు వస్తే ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి వేలాది రూపాయలు ఖర్చయితున్నాయని వారు ఉన్నారు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (టి యు సి ఐ అనుబంధం) రాష్ట్ర కార్యదర్శి జి రామయ్య డిమాండ్ చేశారు ఈరోజు (ఆదివారం) రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఖమ్మం నగర కమిటీ సమావేశం యూనియన్ నగర అధ్యక్షులు దున్న గురవయ్య నిర్వహించారు. ఈ సమావేశంలో జి రామయ్య మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు పెంచకుండా కాలయాపన చేస్తూ పిఆర్సి కమిటీల పేరిట కాలయాపన చేస్తూ కార్మికులను వంచిస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల గురించి పట్టించుకోవటం లేదని వారు ఆరోపించారు నిత్యం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే మున్సిపల్ కార్మికుల యొక్క కుటుంబాల గురించి పట్టించుకోవటం లేదని వారు ఆరోపించారు పిఆర్సి కమిటీ పేర కాలం గడుపుతున్నారని కావున పిఆర్సి కమిటీని వెంటనే అమలు చేసి మున్సిపల్ కార్మికులకు జీతాలు వెంటనే పెంచాలని, డైలీ కార్మికులకు కాంటాక్ట్ కార్మికుల లాగానే పని చేస్తుంటే జీతాల ఎల్ల అధికారులు తేడాలు చూపించడం సరైనది కాదని వారికి కూడా పీఎఫ్ ఈఎస్ఐ వర్తింపచేయాలని వారు డిమాండ్ చేశారు. వందలాదిమంది కాంట్రాక్ట్ కార్మికులు ఖమ్మం నగరంలో వివిధ సెక్టార్లలో పనిచేస్తున్నారు. వీరికి ఈఎస్ఐ హాస్పిటల్ జిల్లా కేంద్రంలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారే తప్ప కార్మికులకి ఎటువంటి ప్రయోజనం లేదు దానిలో కార్మికులకు కావలసిన మందులు లేకపోవడం వల్ల వైద్యానికి దూరం అవుతున్నారని వారు అన్నారు, జిల్లా పార్లమెంటు సభ్యులు మరియు మంత్రులు జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ (ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్) హాస్పటల్ ఏర్పాటు చేయాలని వారు కోరారు, నిత్యవసర సరుకుల ధరలు ఒకపక్క విపరీతంగా పెరిగిపోయి వస్తున్న వేతనాలే సరిపోని స్థితిలో కార్మికులు కొట్టుమిట్టాడు తున్నారు కావున మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులకు 26 వేల రూపాయలు డైలీ వేజ్ మీద పనిచేస్తున్న కార్మికులకు కూడా 26 వేల రూపాయలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు కోరారు, ఈ సమావేశంలో టి యు సి ఐ ఏరియా కార్యదర్శి కొయ్యల శ్రీనివాస్, తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ఉపాధ్యక్షులు కిన్నెర నారాయణ, నగర నాయకులు కాంతయ్య, యాదమ్మ, రాము, సైదులు, రవి, బాబు, శ్రీనివాసరావు, సుధాకర్, అనిల్, వెంకటేశ్వర్లు, గోగుల వెంకన్న, యుగంధర్, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు

# విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**తెలంగాణ స్టేట్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యాదర్సులు రాజయ్య, బుచ్చి రెడ్డి**

ఖమ్మం, జూలై 19, ప్రభాత వార్త :




విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యాదర్సులు బి.రాజయ్య, ఎస్.బుచ్చి రెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మం లోని ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ...2013 సి ఆర్ సీ ఏరియర్స్ పై యాజమాన్యం చెల్లించవలసిన పిఎఫ్ కాంట్రిబ్యూషన్ ను పీఎఫ్ కమిషనర్ ఆఫీస్ కు త్వరగా పంపించాలని కోరారు. టీజీఎస్ఆర్టిసి విశ్రాంత ఉద్యోగులకు 2017 పిఆర్సి బకాయిలను 9 సంవత్సరాలు అవుతున్నా ఇంతవరకు చెల్లించలేదన్నారు. 2021 పి ఆర్ సి ని అమలుపరచి విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన 2017, 2021 పి ఆర్ సి ఎరియర్స్ చెల్లించాలని కోరారు. సూపర్ లగ్జరీ సర్వీసులో విశ్రాంత ఉద్యోగులకు, వారి జీవిత భాగస్వాములకు ఉచిత ప్రయాణం చేసేందుకు అనుమతించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగుల వైద్య సదుపాయాలు, మందుల పంపిణీ, మెంబర్షిప్ గతంలో తార్నాక ఆసుపత్రిలో విశ్రాంత ఉద్యోగులకు రెండు నెలలకు సరిపడా మందులు ఇచ్చేవారని, ప్రస్తుతం కేవలం ఒక నెలకు మాత్రమే ఇస్తుండటం వల్ల వివిధ జిల్లాల నుండి వచ్చే వృద్ధులైన విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో లాగే ఒకేసారి రెండు నెలలకు మెడిసిన్ ఇచ్చే విధానాన్ని తిరిగి అమలు చేయాలని కోరారు. అన్ని జిల్లాల ఆసుపత్రులలో కూడా అన్ని రకాల మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేటట్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు వివిధ కారణాల వల్ల తార్నాక ఆసుపత్రిలో మెంబర్షిప్ తీసుకోలేకపోయిన విశ్రాంత ఉద్యోగులందరికీ సభ్యత్వం పొందేందుకు మరొక్కసారి అవకాశం కల్పించాలని కోరారు. ఆర్టీసీలో స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్న ఉద్యోగులు మరణించినప్పుడు వారి కుటుంబాలకు 30 వేల దహన సంస్కారాల సహాయాన్ని వర్తింపజేయాలన్నారు. ఆర్టీసీలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగి ప్రతి సంవత్సరం ఎస్ఆర్బిసి లైఫ్ సర్టిఫికెట్ను అనారోగ్య రీత్యా మూడు సంవత్సరములు దాటిన వారికి ఈ నెల నుండి లైవ్ సర్టిఫికెట్ ఇవ్వడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. విశ్రాంతి ఉద్యోగులు బయట జిల్లాల నుండి తార్నాక హాస్పిటల్కు ట్రీట్మెంట్ కోసం వచ్చే సందర్భంలో హైదరాబాద్ హెడ్ క్వార్టర్ లో ఉండవలసి వస్తుందని, వారికి సిబిఎస్ లో గాని జేబీఎస్ లో గాని ఉన్న రెస్ట్ రూమ్ లో ఫోర్ బెడ్స్ ఇప్పించాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రీజనల్ ప్రెసిడెంట్ బివి రావు, రీజనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.లీల, కరీంనగర్ జోనల్ సెక్రటరీ జెజె రత్నం, ఆర్.వి భద్రం పాల్గొన్నారు.

# జన్మదిన వేడుకలను అన్నదానంతో అర్ధవంతం చేసిన విశ్రాంత తహశీల్దార్ వి.జి.కె. మూర్తి

ఖమ్మం టౌన్ , జూలై 19 (ప్రభాతవార్త):



ఖమ్మం వాస్తవ్యులు, విశ్రాంత తహశీల్దార్, సేవాతత్పరులు వి.జి.కె. మూర్తి తన జన్మదినాన్ని ఆదివారం సేవా కార్యక్రమంతో అర్ధవంతంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సహాయకుల కోసం శ్రీ సత్యసాయి సేవా సంస్థలు నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద సేవలో భాగస్వాములై ప్రేమతో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు దూరంగా ఉంచి, అవసరమైన వారికి అన్నదానం చేయడం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలిచారని పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా రోగుల సహాయకులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వై. రామారావు, శ్రీరామ్ ప్రభాకర శ్రేష్ఠి తదితరులు వి.జి.కె. మూర్తికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గాయత్రీ మాత ఆశీస్సులతో ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షి ంచారు. అన్నదాన కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థ సభ్యులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొని వి.జి.కె. మూర్తికి అభినందనలు తెలిపారు. సేవా కార్యక్రమాలతో జన్మదినాన్ని జరుపుకోవడం సమాజానికి స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడ్డారు




# నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు

ప్రభాతవార్త కలెక్టరేట్ జులై 19.

నేడు (జూలై 20) సోమవారం రోజున ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం లేదని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా కారణాల రీత్యా సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం లేదని ఈ విషయాన్ని ప్రజలు గమనించి, ఎవరు కూడా దరఖాస్తులు ఇవ్వటానికి జిల్లా కలెక్టరేట్ కు రావద్దని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# సింగరేణి కుంభకోణాలపై సీబీఐతో విచారణ జరిపించాలి

**రైతుల సమస్యలపై త్వరలో కలెక్టరేట్ ముందు ధర్నాలు**

**సెప్టెంబర్ 26న జాబ్ మేళా**

**రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ**

**విలేకర్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్**

ఖమ్మం, జూలై 19, ప్రభాత వార్త :



సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలపై తక్షణమే సిబిఐ చేత విచారణ జరిపించాలని, వాటాల వారిగా పంచుకుంటున్న అధికారులను, ప్రజాప్రతినిధులను అరెస్ట్ చేయాలని మాజీ ఎమ్మెల్సీ , తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్ డిమాండ్ చేసారు. ఖమ్మం లోని మామిళ్ల గూడెం లో ఆర్ ఎల్ డి పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దిలీప్ కుమార్ మాట్లాడుతూ.... సింగరేణి వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, బొగ్గును వాటాల వారీగా పంచుకుని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఆంధ్రా కాంట్రాక్టర్ల పెత్తనం పెరిగిపోయిందని, అధికారుల చేతివాటం పెరగడం వల్ల సింగరేణి మనుగడ దెబ్బ తినే ప్రమాదముందన్నారు. ఈ వ్యవహారం పై దర్యాప్తు చేపట్టి దోషులను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో నకిలీ విత్తనాల వ్యవహారం కూడా తారా స్థాయిలో ఉందని, రైతులకు వెన్నంటే ఉండే విధంగా తమ పార్టీ ఆధ్వర్యంలో త్వరలో కలెక్టరేట్ ల ముందు ధర్నాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తమ పార్టీ నేతృత్వంలో సెప్టెంబర్ 26న పెద్ద ఎత్తున జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు దిలీప్ కుమార్ తెలిపారు. అదే రోజు అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ఖిలక్ష ్యం కోసం....లక్ష సైన్యంఖి అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. త్వరలో జరుగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఖమ్మం నల్లగొండవరంగల్ నియోజకవర్గం నుండి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు ఆర్.ఎల్.డి పార్టీలో చేరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ జానీ మహమ్మద్, జిల్లా ఉపాధ్యక్షుడు మోత్కురి వెంకటేశ్వర చారి, రాష్ట్ర అధికార ప్రతినిధి పి. వీరప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. నర్సింహ రావు, రాష్ట్ర కార్యదర్శి విశాల్, రాష్ట్ర కోశాధికారి గిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నోజు వెంకట రమణ చారి, మహిళా జిల్లా అధ్యక్షురాలు ఇటుకల లత, జిల్లా నాయకురాలు బండి నాగమణి తెలిపారు.



# మణుగూరు ఘటనపై నిష్పక్షపాత విచారణకు అటవీ శాఖ ఆదేశాలు

- ఈ ఘటనపై విచారణకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు
- ఈ ఘటనను రెండు వర్గాల మధ్య వివాదంగా మలచొద్దు
- జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్



**అశ్వాపురం,ప్రభాతవార్త, జూలై 19:**

మణుగూరు డివిజన్‌లో 17 జూలై 2026న మొక్కల పెంపకం మరియు అటవీ భూమి పరిరక్షణ పనుల సందర్భంగా జరిగిన ఘటనను, అలాగే మీడియా మరియు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం అవుతున్న వీడియోలను అటవీ శాఖ తీవ్రంగా పరిగణించింది. ఈ మేరకు ఆదివారం జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి పౌరుని, ముఖ్యంగా మహిళల గౌరవం మరియు భద్రతకు అటవీ శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. అదే సమయంలో, వీడియోలో కనిపించే ఘటనకు ముందు జరిగిన పరిణామాలు, ప్రభుత్వ పనులకు కలిగిన ఆటంకం, యూనిఫాంలో ఉన్న అటవీ సిబ్బందిపై జరిగినట్లు చెబుతున్న దాడి సహా మొత్తం సంఘటనల క్రమాన్ని నిష్పక్షపాతంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. పారదర్శకత మరియు బాధ్యతను నిర్ధారించేందుకు కొన్ని చర్యలు తీసుకున్నామని, వాటిలో భాగంగా వీడియోలో మహిళతో జరిగిన తోపులాటలో కనిపించిన ఫారెస్ట్ బీట్ అధికారిని విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్‌లో ఉంచడం జరిగింది. సస్పెన్షన్ అనేది తాత్కాలిక పరిపాలనా చర్య మాత్రమే, దోషిగా నిర్ధారించినట్లు భావించరాదు. కిన్నెరసాని ఫారెస్ట్ డివిజనల్ అధికారి అధ్యక్షతన, చంద్రుగొండ మరియు యానంబైల్ ఫారెస్ట్ రేంజ్ అధికారులు సభ్యులుగా ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ ఏర్పాటు చేయబడింది. సంబంధిత పర్యవేక్షణ మరియు క్షేత్రస్థాయి అధికారుల నుంచి వివరణలు కోరబడ్డాయి. అసలు వీడియోలు, ఫోటోలు, వైద్య నివేదికలు మరియు అధికారిక రికార్డులను భద్రపరిచి విచారణ కమిటీకి అందజేయడం జరుగుతోంది. పోలీసు శాఖ మరియు ఇతర సంబంధిత అధికారులకు అటవీ శాఖ పూర్తి సహకారం అందిస్తుంది. విచారణ కమిటీ మొత్తం ఘటనను పరిశీలించి, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా వ్యక్తిగత బాధ్యతను నిర్ధారిస్తుంది. దుర్వ్యవహారం, నిర్లక్ష్యం లేదా అవసరానికి మించిన బలప్రయోగం జరిగినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన మరియు శాఖాపరమైన చర్యలు తీసుకోబడతాయి. ఈ ఘటనను ఏ రెండు వర్గాల మధ్య లేదా సమాజాల మధ్య వివాదంగా చూడరాదని అటవీ శాఖ స్పష్టం చేస్తోంది. అత్యంత విలువైన ప్రభుత్వ అటవీ భూమిని రక్షించడం మరియు మంజూరైన మొక్కల పెంపకం పనులను అమలు చేయడం శాఖ యొక్క చట్టబద్ధమైన బాధ్యత. దూర ప్రాంతాల్లో, క్లిష్ట పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది సేవలను శాఖ గౌరవిస్తుంది. నిజాయితీగా, చట్టబద్ధంగా మరియు సంయమనంతో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి శాఖ పూర్తి సంస్థాగత మద్దతు కొనసాగుతుంది. భవిష్యత్తులో ఇలాంటి సున్నితమైన క్షేత్రస్థాయి కార్యక్రమాలు తగిన ముందస్తు ప్రణాళిక, పోలీసు సమన్వయం, మహిళా సిబ్బంది నియామకం మరియు నిరంతర అధికారిక వీడియో రికార్డింగ్‌తో మాత్రమే నిర్వహించబడతాయి. పూర్తి వాస్తవాలను నిష్పక్షపాత విచారణ ద్వారా వెలికితీయడానికి ప్రజలు మరియు మీడియా సహకరించాలని, అసంపూర్ణమైన లేదా ఎంపిక చేసి ప్రసారం చేసిన వీడియోల ఆధారంగా ముందస్తు నిర్ణయాలకు రావద్దని అటవీ శాఖ విజ్ఞప్తి చేస్తోంది. ప్రభుత్వ అటవీ భూముల పరిరక్షణతో పాటు ప్రజల గౌరవం, భద్రత, పారదర్శకత మరియు న్యాయబద్ధతను కాపాడేందుకు అటవీ శాఖ కట్టుబడి ఉందన్నారు.

## పూర్తికాని రోడ్డుకు ప్రారంభోత్సవ మేల..?

హడావుడి పర్యటనలో అంతర్యం

ఉన్న పోడు భూములకు పట్టాలిస్తానన్న హామీ ఏమైంది..?

అశ్వాపురం మాజీ ఉపసర్పంచ్ భూక్యా చందులాల్

**అశ్వాపురం,ప్రభాతవార్త జూలై 19:**

పూర్తిగా నిర్మించని రోడ్డును ఈరోజు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభోత్సవం చేస్తున్నారని, ఇది ప్రపంచంలో ఏదో వింత అని అశ్వాపురం మాజీ ఉపసర్పంచ్ భూక్య చందులాల్ అన్నారు. అశ్వాపురంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ అశ్వాపురం నుండి మొండికుంట వయా గొందిగూడెం రోడ్డు పూర్తిగా నిర్మించకుండానే ఈరోజు హడావుడిగా ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేస్తున్నారని, ఇదేనా ప్రజా పాలన అని, అసలు అశ్వాపురం మండలంలో రాష్ట్ర మంత్రుల హడావుడి పర్యటన వెనుక అంతర్యమేమిటో అర్థం కాకుండా ఉందన్నారు. ఇటీవల జరిగిన సీతారామ ప్రాజెక్టు సీతమ్మ బ్యారేజ్ సందర్శనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంలోని



ముగ్గురు మంత్రులు విచ్చేసిన సందర్భంగా అది అధికార పార్టీ పర్యటనలా లేదని, జన సందోహం లేక పర్యటన పేవలం గా జరిగిందని, దానిని కప్పి పుచ్చుకోవటానికి మాత్రమే ఈ పర్యటనని, అంతే గాని ఈ పర్యటనలలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని వారు ఎద్దేవా చేశారు. మొన్న జరిగిన మంత్రుల పర్యటనలో కనీసం మారెళ్ళ పాడు ప్రాజెక్టు పూర్తి చేసి ఎన్ని రోజుల్లో మండలంలో చెరువులకు నీళ్లు ఇస్తామనేదే ముచ్చటే లేదని, ఈరోజు పర్యటనలో ఒరిగేది కూడా ఏమీ లేదని, ప్రారంభోత్సవాలు శంకుస్థాపన తప్ప ప్రజలకు మేలు చేసే ఒక్క విషయం కూడా లేదని, రెవిన్యూ శాఖ మంత్రి ఈరోజు మండలంలో పర్యటిస్తున్న సందర్భంగా మండలంలో మిగిలిన పోడు భూములకు పట్టాలు ఇస్తా అన్న హామీని ఏమైనా నెరవేర్చారా, లేదా నెల్లిపాక రెవెన్యూ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా ఆ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సందర్భంలో ఆ భూములను నిషేధిత జాబితా నించి ఏమన్నా తొలగించారా అని, ప్రజాధనం దుర్వినియోగం తప్ప ఈ పర్యటన వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని వారు అన్నారు. ఇకనైనా ప్రజలకు మేలు కోరే పనులు చేయాలని, ప్రజలకు ఇస్తారన్న ఆరు గ్యారంటీలు అమలు చేసి రాష్ట్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మంత్రి పొంగులేటికి ఏఐఎస్ఎఫ్ వినతి పత్రం

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి.

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఇనపల్లి పవన్ సాయి

**అశ్వాపురం,ప్రభాతవార్త, జులై 19:**

అశ్వాపురం మండలంలో పర్యటనలో భాగంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారికి అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఈనపల్లి పవన్ సాయి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి నాగేంద్రబాబు, మాట్లాడుతూ, రాష్ట్రంలో గత 7 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లలో తాగునీరు,



మరుగుదొడ్లు, విద్యుత్, కాస్మోటిక్, వర్షా కాలం కావున దోమల బెడద నుండి రక్షణ వంటి వసతి, భద్రత, పరిశుభ్రత వంటి మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశామని తెలియజేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేల క్లస్టర్ పాఠశాలలుగా కుదించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరిం చుకోవాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యారంగంలో నెలకొన్న అన్ని సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని గౌరవ మంత్రి పొంగిలేటి గారికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు, చింతల రమేష్, గణేష్, సిద్ధార్థ, నిఖిల్, అజయ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## కమలాపురంలో నేరుగా విత్తే వరి సాగుపై అవగాహన

**మణుగూరు,ప్రభాతవార్త, జూలై 19:** మణుగూరు మండలం కమలాపురం గ్రామంలో ఆదివారం భారతీయ వరి పరిశోధన సంస్థ (ఐసీఏఆర్–ఐఐఆర్ఆర్), ఎస్‌బీఐ ఫౌండేషన్( సీఎస్ఆర్) ఆధ్వర్యంలో నేరుగా విత్తే వరి (డీఎస్ఆర్) సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీఏఆర్ రీసెర్చ్ అసోసియేట్ డా. ఎస్. కవిరాజు మాట్లాడుతూ.. నేరుగా విత్తే వరి సాగు విధానం ద్వారా నీటి పొదుపుతో పాటు కూలీల కొరతను అధిగమించవచ్చన్నారు. ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను తట్టుకోవడానికి, సాగు ఖర్చులు తగ్గించుకుని ఆదాయం పెంచుకోవడానికి డీఎస్ఆర్ ఎంతో అనుకూలమని వివరించారు. అనంతరం



రైతులకు డీఎస్ఆర్ మ్యాట్లను పంపిణీ చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారి డాక్టర్ కొమరం లక్ష్మణ్ రావు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఆరు తడుల పంటల సాగు చేపట్టాలని, అందుబాటులో ఉన్న నీటిని శాస్త్రీయ పద్ధతుల్లో వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సిబ్బంది, గ్రామ రైతులు బత్తుల శ్రీను, మునిగల బిక్షం, ఉప్పట్ల వెంకటేశ్వర్లు, రమణయ్య, కోర్స శీను తదితరులు పాల్గొన్నారు.




## సర్పంచ్, ఉప సర్పంచ్ వినతికి స్పందన

అశ్వాపురంలో కొత్త గ్రామపంచాయతీ భవనానికి అడుగులు

ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్, వెటర్నరీ, ఆయుర్వేద ఆస్పత్రి స్థలాల పరిశీలన

**అశ్వాపురం,ప్రభాతవార్త,జులై 19;**



అశ్వాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశాలకు స్థలం సరిపోకపోవడం భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్త భవన నిర్మాణం కోసం గతంలో సర్పంచ్ సదర్ లాల్, ఉపసర్పంచ్ ప్రకాష్‌రావు జిల్లా పంచాయతీ అధికారిణి అనూషకు వినతిపత్రం సమర్పించారు. ఆ వినతికి స్పందించిన జిల్లా పంచాయతీ అధికారిణి ఆదివారం అశ్వాపురంలో పర్యటించి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. అదేవిధంగా ఇరుకుగా గ్రామపంచాయతీ భవనం ఉండటంతో కొత్త గ్రామపంచాయతీ భవనం నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస పరిసరాలు, వెటర్నరీ ఆస్పత్రి స్థలం, ఆయుర్వేద ఆస్పత్రి స్థలాలను పరిశీలించి వాటి అనుకూలతపై వివరాలు సేకరించారు. అనంతరం ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, అనువైన స్థలాన్ని ఎంపిక చేసి కొత్త గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే నూతన గ్రామపంచాయతీ భవనం అత్యవసరమని సర్పంచ్ సదర్ లాల్, ఉపసర్పంచ్ ప్రకాష్‌రావు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారిణి స్పందించి స్వయంగా స్థలాలను పరిశీలించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కందిమల్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ అధికారులపై జరిగిన దాడి దారుణం

జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్, మణుగూరు యూనిట్

**అశ్వాపురం,ప్రభాతవార్త, జులై 19;**

మునుబోతుల గూడెం వేములూరు గ్రామంలో ఫారెస్ట్ అధికారులపై జరిగిన దాడి అత్యంత దారుణమని, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్, మణుగూరు యూనిట్ అధ్యక్షుడు వి.గోవింద్ అన్నారు. అశ్వాపురంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఫారెస్ట్ అధికారులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. మనుబోతులపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లో అటవీ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్న సమయంలో కొందరు గొత్తికోయాలు గుంపుగా వచ్చి ఫారెస్ట్ అధికారుల విధులకు ఆటంకం కలిగించడం, జేసీబీ పనులను అడ్డుకోవడం, అధికారులతో వాగ్వాదానికి దిగడం, భౌతిక దాడులకు పాల్పడడం వంటి సంఘటనలు అత్యంత ఖండనీయమని సమావేశం అభిప్రాయపడింది. అదే విధంగా, అనంతరం ఫారెస్ట్ అధికారులపైనే తప్పుడు ఆరోపణలు చేస్తూ అసత్య ప్రచారం చేయడం, అలాగే కొంతమంది సోషల్ మీడియా మరియు ఇతర మాధ్యమాల్లో ఫారెస్ట్ అధికారులను ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న అటవీ అధికారుల భద్రతకు భంగం కలిగించే చర్యలపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే తప్పుడు ప్రచారం చేసి అధికారుల మనోధైర్యాన్ని దెబ్బతీసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ మణుగూరు యూనిట్ ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరింది. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పద్దం ఎర్రయ్య, బి.భీమ్‌చంద్, కోశాధికారి జి.బాబురావు కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా కృషి చేయాలి

### ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలి

### శాసనమండలి సభ్యుడు తక్కెళ్లపల్లి రవీందర్ రావు





**ఇల్లందు, జూలై 19, ప్రభాతవార్త:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం, ప్రతి ఓటును పరిరక్షించడం లక్ష్యంగా పార్టీ తరపున నియమితులైన బూత్ స్థాయి ప్రతినిధులు క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలని శాసనమండలి సభ్యుడు తక్కెళ్లపల్లి రవీందర్ రావు సూచించారు. ఇల్లందు నియోజకవర్గ కార్యాలయంలో మాజీ శాసన సభ్యురాలు బానోత్ హరిప్రియ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి ముందు పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు సిలివేరి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ద్విచక్ర వాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా ప్రతి పోలింగ్ కేంద్రంలోని పార్టీ ప్రతినిధులు అప్రమత్తంగా పనిచేయాలన్నారు. ఓటు రాజ్యాంగం కల్పించిన విలువైన హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరూ అవసరమైన దరఖాస్తులను బూత్ స్థాయి అధికారులకు సకాలంలో అందజేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటు హక్కు కీలకమని, నియోజకవర్గ ప్రజలకు ఈ ప్రక్రియపై ఎలాంటి సందేహాలు ఉన్నా పార్టీ ప్రతినిధులు అందుబాటులో ఉండి వాటిని నివృత్తి చేయాలని తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా సమన్వయంతో పనిచేయాలని, ఓటర్ల సమస్యలను పరిష్కరిస్తూ అవసరమైతే బూత్ స్థాయి అధికారులతో కలిసి విధులు నిర్వహించాలని సూచించారు. పార్టీ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




**ఇల్లెందు, గుండాల, టేకులపల్లి**

## కళాకారుల ఐక్యతకు కొత్త వేదిక

### భద్రాద్రి జిల్లా నూతన కమిటీ ఎన్నిక



**ఇల్లందు అర్బన్, జూలై 19, ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నృత్య గురువులు, నృత్య కళాకారులు, వ్యాఖ్యాతలు, కార్యక్రమాల నిర్వాహకుల సంక్షేమం, ఐక్యత, వృత్తి అభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటు చేసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నృత్య గురువులు, నృత్య కళాకారులు, వ్యాఖ్యాతలు, కార్యక్రమాల నిర్వాహకుల సంఘం నూతన జిల్లా కమిటీ ఎన్నికలు ఆదివారం ఇల్లందులోని ఎంఆర్జీ నారాయణ పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా ఏ. శ్రీకాంత్ (ఇల్లందు), ప్రధాన కార్యదర్శిగా కంచర్ల ప్రవీణ్ (పాల్వంచ), కార్యనిర్వాహక అధ్యక్షుడిగా శేఖర్ (ఇల్లందు), ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్ (కొత్తగూడెం), కార్యదర్శులుగా రమేష్ (పాల్వంచ), అశోక్ (ఇల్లందు), కోశాధికారిగా భాను (పాల్వంచ), ప్రచార కార్యదర్శులుగా రాధిక (కొత్తగూడెం), పావని (పాల్వంచ), గౌరవాధ్యక్షుడిగా దండు సారయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియను సీనియర్ నృత్య గురువు కదారి వెంకటేష్ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని కళాకారుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, ఐక్యత, వృత్తి పరమైన అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా నృత్యం, వ్యాఖ్యానం, కార్యక్రమ నిర్వహణ రంగాల్లో ఉన్న కళాకారులకు శిక్షణా శిబిరాలు, అవగాహన సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, వారి సమస్యల పరిష్కారానికి సంఘం తరపున కృషి చేస్తామని నూతన కమిటీ వెల్లడించింది.

## బంజారాల సంస్కృతిని కాపాడుకోవాలి

### ఘనంగా హాతీరాం బావాజీ జయంతి వేడుకలు

### పాల్గొన్న మేయర్ గణేష్, శ్రేయాస్ మీడియా చైర్మన్ శ్రీనివాసరావు



**కొత్తగూడెం టౌన్, జూలై 19 ప్రభాతవార్త:** శ్రీ వెంకటేశ్వరస్వామితో పాచికలు ఆడిన అత్యంత ప్రియమైన భక్తుడు హాతీరాం బావాజీ 597వ జయంతి వేడుకలను బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ బానోత్ వీరునాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని ప్రకృతి ఆశ్రమంలో నిర్వహించిన వేడుకలకు కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గిరిజన పూజారులు, సాధు సంతులు ప్రత్యేక పూజలు, హోమం, భోగ్‌బండారో కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ గణేష్ మాట్లాడుతూ... బంజారాల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేటి తరానికి మన పూర్వీకుల విశిష్టతను తెలియజేయాలని కోరారు. ఈ భోగ్‌బండారో వేడుకల్లో శ్రేయాస్ మీడియా చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొని పూజా కార్యక్రమాలను ప్రత్యక్షంగా తిలకించారు. బంజారాల సంస్కృతి, సాంప్రదాయాల గురించి సాధు సంతులను గిరిజన పూజారులను అడిగి తెలుసుకున్నారు. జగదంబ సేన వ్యవస్థాపక అధ్యక్షులు తేజావత్ రాములు మహరాజ్ మాట్లాడుతూ... హాతీరాం బావాజీ శ్రీ వెంకటేశ్వరస్వామి వారితో అత్యంత సన్నిహితంగా ఉంటూ ఆయనతో పాచికలు ఆడినట్లు చరిత్ర చెబుతుందన్నారు. జేఏసీ చైర్మన్ వీరునాయక్ మాట్లాడుతూ... ప్రతి ఏడాది సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను నిర్వహించిన విధంగానే బంజారాలంతా కలిసికట్టుగా ఉంటూ శ్రీ హాతీరాం బావాజీ జయంతి వేడుకలను సైతం నిర్వహించుకునేందుకు బంజారాలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ప్రాంగణంలో శ్రీ హాతీరాం బావాజీ మఠాన్ని ఏర్పాటు చేసేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. వచ్చేనెలలో జరగనున్న తీజ్ వేడుకలకు జేఏసీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఏసీ గౌరవ అధ్యక్షులు రాములు నాయక్ రమేష్ రాథోడ్ జేఏసీ జిల్లా నాయకులు కేశవ్, భద్రు, హనుమంతు, మంచ్యా నాయక్, శంకర్ నాయక్, సర్పంచ్ లైలా, సాధు సంతుల భద్య, శంకర్, బాలు, రమేష్, గురు, లచ్చు, బాలు, సక్రు, మిట్టు, యువశక్తి చంద్రకళ, శివశక్తి సౌజన్య, టిఎస్‌టిటిఎఫ్ నాయకులు బి.రాములు, బి. రమేష్ రాథోడ్, రత్నాకర్, బి.మోహన్, బాలకృష్ణ, బాబులాల్, రవి, చందర్, వీరన్న, మోహన్, నర్సింహా, పీఆర్‌టీయూ నాయకులు బి.భాస్కర్, టి.మోహన్, యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకులు జె.బి. బాలు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ మార్పుపై వస్తున్న వార్తలు అవాస్తవం

### : కార్పొరేటర్ కంచర్ల హిమశ్రీ



**కొత్తగూడెం టౌన్, జూలై 19 ప్రభాతవార్త:** తాను పార్టీ మారడం లేదని, సిపిఐ పార్టీలోనే కొనసాగుతానని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేటర్ కంచర్ల హిమశ్రీ స్పష్టం చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... తన సహోదరికి డిగ్రీ అడ్మిషన్ కోసం సాయం కోరేందుకు మాత్రమే వెళ్లానని, దీనిని పార్టీ మార్పుగా ప్రచారం చేయడం పూర్తిగా అవాస్తవమని తెలిపారు. తాను సిపిఐ పార్టీ తరపున కార్పొరేటర్‌గా గెలిచి ప్రజలకు సేవ చేస్తున్నానని, పార్టీ పట్ల పూర్తి నిబద్ధతతో కొనసాగుతున్నానని హిమశ్రీ పేర్కొన్నారు. ఇతర పార్టీలో చేరుతున్నానంటూ ప్రచారంలో ఉన్న వార్తలను ఆమె తీవ్రంగా ఖండించారు. వాస్తవాలు తెలుసుకుని మాత్రమే వార్తలు ప్రచురించాలని, నిరాధార ప్రచారాలకు తావివ్వొద్దని మీడియాను ఆమె కోరారు. ఈ సమావేశంలో కొత్తగూడెం మేయర్ మూడు గణేష్ నాయక్, మాజీ కౌన్సిలర్ కంచర్ల జమలయ్య పాల్గొన్నారు.

## ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా యాకుబ్ పాషా

### చావల పురుషోత్తంకు

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు

**లక్ష్మీదేవిపల్లి, జూలై 19 ప్రభాతవార్త:** లక్ష్మీదేవిపల్లి, మండలంలోని లోతువాగు గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం తెలంగాణ ఉపసర్పంచుల ఫోరం సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉపసర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ముఖ్య అతిథిగా హాజరై ఉపసర్పంచులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పలు నియామకాలను ప్రకటించారు. లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన చావల పురుషోత్తంను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, లోతువాగు గ్రామ ఉపసర్పంచ్ యాకుబ్ పాషాను లక్ష్మీదేవిపల్లి మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా నియమించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ చేతుల మీదుగా ఇద్దరికీ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు మాట్లాడుతూ, తమపై ఉంచిన నమ్మకానికి రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపసర్పంచుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, సంఘం బలోపేతం కోసం సమిష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రామారావు, రాష్ట్ర కార్యదర్శి కిషోర్ నాయక్, ఉపసర్పంచులు వెంకట నరసయ్య, రాజు, కేశవరావు తదితరులతో పాటు వివిధ మండలాలకు చెందిన ఉపసర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# అన్నారుగూడెంలో చెరువులను తలపిస్తున్న రోడ్లు..

తల్లాడ జూలై 19: ప్రభాతవార్త

మండల పరిధిలోని అన్నారుగూడెం ఎస్సీ కాలనీలోని రోడ్లు కొద్దిపాటి వర్షానికి చెరువులు తలపిస్తున్నాయి శనివారం రాత్రి కురిసిన వర్షానికి నీళ్లు నిలిచి రోడ్లు చెరువులు తలపిస్తుండగా గ్రామస్తులు ఆందోళనతో ఉండగా



సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు కాలనీ సందర్శించి ఎస్సీ కాలనీలో నీరు నిలవకుండా ఉండడం కోసం జిల్లా కలెక్టర్ రెండు వైపులా సైడ్ రైన్ నిర్మాణానికి 20 లక్షలు మంజూరు చేశారని కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకో పోవడం వల్ల జాప్యం జరిగిందని గుర్తు చేస్తూ దీనికి తోడు గ్రామస్తులు కూడా డ్రైన్ల నిర్మాణానికి అడ్డు తగులుతున్నారని గుర్తు చేస్తూ ముందుగా ఎటు నుంచి తీయాలో నిర్ణయిస్తే పనే ప్రారంభించడంతోపాటు జెసిబి ద్వారా నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు ఈ కార్యక్రమంలో దొడ్డ చిన్న శీను మారెళ్ళ దేవేందర్ నరసింహారావు శ్రీనివాసరావు పాల్గొన్నారు

# రఘుపతి రెడ్డి కుటుంబాన్ని ఓదార్చిన మంత్రి పొంగులేటి..

తల్లాడ జూలై 19: ప్రభాతవార్త

అనారోగ్యంతో మృతి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దగ్గుల రఘుపతి రెడ్డి కుటుంబ సభ్యులను రాష్ట్ర



రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు రఘుపతి రెడ్డి మరణించినప్పుడు తాను హైదరాబాదులోని ఆసుపత్రికి సమీపంలో ఉన్నానని తనకు విషయం తెలియదని గుర్తు చేశారు మంత్రిని చూడగానే రఘుపతి రెడ్డి సతీమణి కన్నీటి పర్యంతం కా గా ఆమెని ఓదార్చారు తల్లాడ లో కాంగ్రెస్కు పెద్దదిక్కుగా ఉన్నారని గుర్తు చేశారు సందర్భంగా రఘుపతి రెడ్డి ఇద్దరు కుమారు లతో కూడా మంత్రి మాట్లాడారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మి మ్రెడ్డి బి రాజశేఖర్ దుండేటి వీరారెడ్డి ఎర్రి నరసింహారావు రేగళ్ల పుల్లారెడ్డి దగ్గుల నారాయణరెడ్డి. బొడ్డు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

# ఎల్‌నినో సవాల్‌ను సమష్టిగా ఎదుర్కొందాం.....

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షలో మంత్రుల పిలుపు...

కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉండటంతో రైతులు, ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం మిషన్ మోడ్‌లో పనిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వార్డు సభ్యుడి నుంచి కలెక్టర్ స్థాయి వరకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి ప్రకృతి విపత్తును ఎదుర్కోవాలని సూచించారు. ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై గ్రామ గ్రామాన రైతులకు అవగాహన కల్పించాలని, భూగర్భ జలాలు,సాగునీటి లభ్యతపై స్పష్టమైన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో అందించాలని చెప్పారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఎల్‌నినోను రాజకీయాలకు అతీతంగా ఎదుర్కోవాలన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు కూడా రైతుల సంక్షేమ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

# దహన సంస్కారాలకు ఆర్థిక వితరణ

దమ్మపేట రూరల్ జులై 19 ప్రభాతవార్త :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,దమ్మపేట మండల కేంద్రానికి చెందిన శ్రీ గాయత్రీ వైద్యశాల బృందం ఆదివారం దహనసంస్కారల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. వైద్యశాల బృందం తెలిపిన వివరాల ప్రకారం



పట్వారిగూడెం పిహెచ్ సి పరిదిలో ఆశావర్కర్ గా విధులు నిర్వహిస్తున్న కొత్తూరు గ్రామానికి చెందిన కూరం శ్యామల అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందారు. వీరి కుటుంబ సబ్యులు నిరుపేదలు కావడంతో దహనసంస్కారాల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారికి మానవతా దృక్పథంతో దమ్మపేట కు చెందిన శ్రీ గాయత్రీ వైద్యశాల బృంధం ఆర్థికంగా సహకరించారు. వీరిలో వైద్యశాల యాజమాన్యం తో పాటుగా వైద్యులు పి.మోనిక ,సాయికృష్ణ , ఉదయ్ భాస్కర్ లు ఉన్నారు.

# మాజీ ఎమ్మెల్యే సండ్ర పరామర్శలు

తల్లాడ జులై 19 ప్రభాతవార్త

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతి రెడ్డి చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నివాళులర్పించారు ఆదివారం రఘుపతి రెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబ



సభ్యులు కూడా పరామర్శించారు ప్రజా ప్రతినిధిగా గ్రామ అభివృద్ధికి కృషి చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు ఆయన కుమారుడు శ్రీనివాస్ రెడ్డి నీ ధైర్యంగా ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ అధ్యక్షుడు రెడ్డెం వీర మోహన్ రెడ్డి డి వెంకట్ లాల్ దగ్గుల శ్రీనివాసరెడ్డి తల్లాడ ఉప సర్పంచ్ కర్నాట లక్ష్మారెడ్డి జివిఆర్ రాజశేఖర్ రెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారుమండల పరిధిలోని గొల్లగూడెం చెందిన దుండేటి కేశవరెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆదివారం మాజీ శాసనసభ్యుడు సండ్ర వెంకట వీరయ్య పరామర్శించారు సందర్భంగా ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు ఆయన వెంట కోడూరు వీర కృష్ణ కోడూరు నాగేశ్వరరావు బొగ్గుల కృష్ణ రెడ్డి ఈసనపల్లి వీరయ్య తదితరులు పాల్గొన్నారు

# వర్షాలు కురవాలని తల్లాడలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు....

తల్లడ జులై 19: ప్రభాత వార్త

..వర్షాలు సకాలంలో కురిసి రైతుల పంటలు పండాలని తల్లాడలో ముస్లిం సోదరులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఈద్గా వద్ద ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ ను చదివి వర్షాలు కురవాలని ప్రార్థనలు చేశారు. వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు సాగు చేయలేని పరిస్థితిలో ఉన్నారని, వర్షాలు పడాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలందరూ పాడి పంటలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు షేక్. ఈసూబ్, అక్బర్, మోలి సాబ్ ముజీబ్,నిజాముద్దీన్,గాలి, జాన్ పాషా, మస్తాన్, మున్నా, సలీం, ముస్తఫా, అబ్దుల్ రెహమాన్, వద్దండి సాహెబ్, మే బల్లి,బాజీ,ఖాసీం, ఇలియాజ్,తదితరులు పాల్గొన్నారు...






# గుర్రాలచెరువులో భక్తిశ్రద్ధలతో ఆషాడబోనాలు

## భక్తిశ్రద్ధలతో పాల్గొన్న మహిళలు

అశ్వారావుపేట రూరల్, జూలై 19 ప్రభాతవార్త:

మండల పరిధిలోని గుర్రాలచెరువు గ్రామంలో తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన ఆషాడ మాస బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఆషాడ ంలో అమ్మవారిని పూజిస్తే సుఖసంతోషాలు, వర్షాలు కురిసి పంటలు పండుతాయని భక్తుల నమ్మకం. ఆషాడ మాసంలో గ్రామ దేవత లను పూజించడం తెలంగాణ సంప్రదాయం. అమ్మవారికి బోనం సమర్పిస్తే అనారోగ్యాలు తొలగి, గ్రామంలో సుఖశాంతులు నెలకొంటాయని పెద్దల



నమ్మకం. ఈ నెలంతా గ్రామాల్లో బోనాలు, పూజలు, అన్నదానాలు జరుగుతాయి. ఉదయం నుండే గ్రామంలో కోలాహలం నెలకొంది. మహిళలు కొత్త చీరలు ధరించి, తలపై బోనాలు, పసుపు కుంకుమతో అలంకరించుకుని "బోలో బోనాలమ్మా" నినాదాలతో ఆలయానికి చేరుకున్నారు. డోలు, మంగళ వాయిద్యాలతో వాతావరణం భక్తిమయంగా మారింది. ఈ నేపథ్యంలో గ్రామ దేవతకు ప్రముఖ నాయకురాలు కాసాని పద్మ, మున్సిపల్ కౌన్సిలర్ భూక్యా ఉదయ జ్యోతిలు పాల్గొని బోనం ఎత్తుకుని గ్రామ వీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్రమంలో కాసాని పద్మ మాట్లాడుతూ, "అమ్మవారి కృపతో గ్రామంలోని ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు ఉండాలని, రైతులకు మంచి వర్షాలు పడి పంటలు పండాలని అన్నారు. బోనాల అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానికులు, మహిళలు, పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

# పట్టణంలో ముత్యాలమ్మ తల్లికి బోనాలు

అశ్వారావుపేట అర్బన్, జూలై 19 ప్రభాతవార్త:

పట్టణంలోని వడ్డెర బజార్ వేంచేసి ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆషాడ మాస బోనాల ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు సాంప్రదాయబద్ధంగా తలలపై బోనాలను ధరించి, మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనం సమర్పించి, తమ కుటుంబాలను చల్లగా చూడాలని, గ్రామాన్ని ఆయురారోగ్యాలతో కాపాడాలని మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.



# ఉప ముఖ్యమంత్రి కి కాంగ్రెస్ నేతల ఘన స్వాగతం

**కారేపల్లి జూలై 19 ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు సింగరేణి మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్డులో ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు ఆధ్వర్యంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కామేపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు పూర్తి చేసుకుని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న సందర్భంగా కారేపల్లి క్రాస్ రోడ్డులో ఆయనకు కాంగ్రెస్ శ్రేణులు ఆత్మీయ స్వాగతం అందజేశారు.ఈ సందర్భంగా వాహనం నుంచి దిగిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు నాయకులు శాలువాలు కప్పి, పూలదండలు వేసి ఘనంగా సన్మానించారు. కొందరు నాయకులు మాట్లాడాలని కోరగా, టేకులపల్లి కార్యక్రమాలకు ఆలస్యమవుతున్నందున మరోసారి కలుద్దామని చెప్పి అక్కడి నుంచి బయలుదేరారు. ఉప ముఖ్యమంత్రి వెంట వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు. స్వాగత కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బానోత్ రామ్మూర్తి, తిరుమల రావు మాజీ ఎంపీపీ దేవ్లా నాయక్, అడ్డగోడ ఐలయ్య, సూరపురెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచులు మేదరి వీర ప్రతాప్ టోని భానోత్ హిరలాల్ ఈసాల వెంకటేశ్వర్లు బాలు నాయక్ హనుమంతరావు వరలక్ష్మి ్మ రాజు భద్రం ఎల్లయ్య అజ్మీర ఉమా నరేష్ మూతి వీరస్వామి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.







# గాంధీ నగరంలో రామనామ ధర్మ ప్రచారం.

**కారేపల్లి జూలై 19 ప్రభాత వార్త**

సింగరేణి మండలం గాంధీ నగరంలో అవధూతేంద్ర భక్తమండలి ఆధ్వర్యంలో భగవన్నామం హిందూ ధర్మ ప్రచార కార్యక్రమాన్ని రాత్రి నిర్వహించారు .ఈ సందర్భంగా గ్రామంలో హరే రామ నామంతో నగర



సంకీర్తన చేశారు అనంతరం స్థానిక దేవాలయంలో 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నామ సంకీర్తన సనాతన హిందూ ధర్మం గురించి వివరించారు .ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ప్రవచన కర్త నెహ్రూ వివరించారు .అదేవిధంగా సామాజికవేత్త కడివంటి వేణుగోపాల్ పర్యావరణ పరిరక్షణ ప్లాస్టిక్ నిర్మూలన వాతావరణ సమతుల్యం వంటి అంశాలను భక్తులకు వివరించారు .ఈ కార్యక్రమంలోభక్త మండల అధ్యక్షులు గొట్టుపర్తి శివాజీ నాగభూషణం మనోజ్ కుమార్ రవి కేశగాని నాగయ్య సైదులు గ్రామస్తులు పాల్గొన్నారు

# కాడెద్దుల బండి పై..ఆశల ప్రయాణం..

**కన్నీటి బాటలో రైతు జీవితం.**

**యంత్రాల యుగం..రైతు బతుకు ఆగం అప్పుల భారం.**

**.వర్షాభావం..పెరిగిన పెట్టుబడులు.**

**.గిట్టుబాటు ధర కొరతతో విలవిలలాడుతున్న అన్నదాత.**

**ఏన్కూరు,జూలై 19, ప్రభాతవార్త**

:తెల్లవారక ముందే..కోడి కూయక ముందే ఇంటి ముందున్న కాడెద్దులను విప్పి..బండిని సిద్ధం చేసుకుంటాడు.రైతు చేతిలో నాగలి..బండిపై విత్తనాల సంచి..మనస్సులో మాత్రం ఒకే ఒక ఆశ..ఈసారైనా పంట బాగుంటుందేమో కానీ ఆ ఆశ పొలం చేరుకునే లోపే ఆకాశం వైపు చూసి..మళ్లీ ఆందోళనగా మారిపోతుంది.మేఘాలు కనిపిస్తున్నా..వర్షం రావడం లేదు.పంట వేస్తున్నా భవిష్యత్తు కనిపించడం లేదు.ఇదే నేడు తెలంగాణ రైతు జీవితాన్ని ప్రతి బింబిస్తున్న చేదు వాస్తవం.ఒకప్పుడు కాడెద్దుల బండి..రైతు ఆత్మ గౌరవానికి చిహ్నం..ఇప్పుడు అదే బండి రైతు ఆర్థిక దుస్థితికి ప్రతీకగా మారింది.టాక్టర్ అద్దెకు తీసుకునే డబ్బులేక..డీజిల్ ధరలు భరించలేక యంత్ర వ్యవసాయం అందుబాటు లో లేక మళ్లీ కాడెద్దులనే నమ్ముకొని పొలం బాట పడుతున్న రైతుల సంఖ్య గ్రామాలలో ఇంకా కనిపిస్తూనే ఉంది.

**కాలం మారింది..సాంకేతికత పెరిగింది..**

కానీ రైతు బతుకు మాత్రం మారలేదు.ఈ వానాకాలంలో వర్షాలు ఆలస్యం కావడంతో ఇప్పటికే సాగు చేసిన పత్తి.. తదితర పంటలు ఎండిపోతున్నాయి.మళ్లీ విత్తాలంటే మరో పెట్టుబడి..విత్తనాలు కొనాలి.ఎరువులు వేయాలి.పురుగుమందులు పిచికారి చేయాలి. కూలీలకు కూలీ చెల్లించాలి.ఇవన్నీ కలిపి ఒక ఎకరానికి వేలాది రూపాయలు ఖర్చు అవుతుంది.కానీ చివరికి చేతికి పంట వస్తుందనే నమ్మకం మాత్రం లేదు.రైతు పంట చేతికి వచ్చే లోపే అప్పు ల జాబితా సిద్ధమైపోతుంది.సహకార బ్యాంకులు..జాతీయ బ్యాంకులు..ప్రైవేటు వడ్డీ వ్యాపారులు..స్నేహితులు.. ఎక్కడో ఒక చోట అప్పు చేసి వ్యవసాయం ప్రారంభిస్తాడు.పంట నష్టపోతే అప్పు తీర్చలేడు.అప్పు పై వడ్డీ పెరుగు తుంది.మళ్లీ అదే అప్పు తీర్చేందుకు మరో అప్పు చేయాల్సి వస్తుంది.ఇలా అప్పుల చక్రంలో రైతు జీవితం తిరుగు తూనే ఉంటుంది.వ్యవసాయ మాత్రమే కాదు..కుటుంబ బాధ్యతలు అన్ని కూడా రైతు భుజాల పైనే ఉంటాయి.పి ల్లల స్కూల్ ఫీజులు..కళాశాల ఖర్చులు..పుస్తకాలు..హాస్టల్ ఫీజులు..బస్సు పాసులు..పోటీ పరీక్షల కోచింగ్..వైద్య ఖర్చులు..ఇంటినిర్వహణ..విద్యుత్ బిల్లులు..వృద్ధుల వైద్యం..కుమార్తెల పెళ్లిళ్లు..ప్రతి అవసరానికి డబ్బు కావాలి. కానీ రైతు చేతికి వచ్చే ఆదాయం మాత్రం..ప్రకృతి కరుణ పై ఆధారపడి ఉంటుంది.వ్యవసాయంలో పెట్టుబడులు ఏ టా పెరుగుతున్నాయి.విత్తనాల ధరలు..ఎరువులు ధరలు..పురుగు మందుల ధరలు..కూలీల వేతనాలు. .ట్రాక్టర్ అద్దెలు..అన్ని పెరిగాయి.కానీ రైతు పండించిన పంటకు వచ్చే ధర మాత్రం అదే స్థాయిలో పెరగలేదు.పంట మార్కె ట్ కు తీసుకువెళ్లిన తరువాత కూడా గిట్టుబాటు ధర కోసం వేచి చూడాల్సిన పరిస్థితి.కొన్ని సందర్భాలలో పెట్టుబ డి కూడా రాక రైతు నష్టాలతో ఇంటి బాట పడుతున్నాడు.ఒకసారి కరువు..మరోసారి అతివృష్టి..మరొకసారి గాలి వానలు..వడగళ్ల వానలు..ప్రకృతి విపత్తులు వరుసగా దెబ్బతీస్తున్నాయి.వర్షాలు సమయానికి పడకపోతే విత్తనా లు వృధా..ఎక్కువగా పడితే పంట మునిగిపోతుంది.దేశానికి అన్నం పెట్టే రైతు..ఇంట్లోనే రెండు పూటల భోజనం గురించి ఆలోచించాల్సిన పరిస్థితి రావడం గ్రామీణ భారత వాస్తవాన్ని చెబుతోంది..గ్రామాలలో యువత కూడా వ్య వసాయంపై ఆసక్తి కోల్పోతున్నారు.తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు చూసి..ఉద్యోగాల కోసం పట్టణాలకు వలస వెళుతున్నారు.దీంతో వ్యవసాయానికి వారసులు తగ్గిపోతున్నారు.తాను పండించిన పంటకు గిట్టుబాటు ధర..ప్ర కృతి విపత్తుల సమయంలో తక్షణ సహాయం..నాణ్యమైన విత్తనాలు..సరసమైన ధరలకు ఎరువులు..వడ్డీ లేని.. లేదా తక్కువ వడ్డీతో రుణాలు..పంట బీమా సమర్థవంతంగా అమలు..సాగునీటి భరోసా మార్కెట్లో పారదర్శక కొ నుగోళ్లు..కుటుంబానికి విద్యా..వైద్య భద్రత మాత్రమే.రైతుఆదాయం పెరిగితేనే గ్రామాలలో వ్యాపారాలు..ఉపాధి.. విద్య..ఆరోగ్యం..అభివృద్ధి వేగం పుంజు కుంటాయి.రైతు సంక్షేమం అంటే..కేవలం ఒక వర్గం సం క్షేమం కాదు..అది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పునాది..రైతు నవ్వితేనే గ్రామం నవ్వుతుంది..గ్రామం నవ్వితేనే రాష్ట్రం అభివృద్ధి చెందు తుంది..అన్నదాతకు భరోసా కల్పించే రోజే నిజమైన అభివృద్ధికి అర్థం ఉంటుంది.వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్ర భుత్వం అత్యవసర సహాయ చర్యలు చేపట్టి..పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించడం..రుణాల పున ర్వ్యవస్థీకరణ..వడ్డీ భారం తగ్గించడం..సాగునీటి వసతులను మెరుగుపరచడం..గిట్టు బాటు ధర హామీ ఇవ్వడం.. రైతు కుటుంబాలకు విద్యా..ఆరోగ్య పరిరక్షణ కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలని రైతు సంఘాలు..వ్యవసా య నిపుణులు..గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.కాడెద్దుల బండి పై కనిపిస్తున్న ఆ రైతు ప్రయాణం..నిజానికి ఒక మనిషి ప్రయాణం కాదు.తెలంగాణ రైతాంగం మోస్తున్న ఆశలు..ఆవేదనలు..అప్పులు..కన్నీళ్లు..భవిష్య త్తుపై న మ్మకం అన్ని కలిసి సాగుతున్న ప్రయాణం.ఆ ప్రయాణానికి గమ్యం సుఖ సంతోషాలతో నిండాలంటే రైతు బతుకు నిలబడాలి..రైతే దేశానికి వెన్నుముక.



# భాగ్యనగర్ తండా కాంగ్రెస్ నేతలచే మోటార్ సైకిల్ ర్యాలీ

**కారేపల్లి జూలై 19 ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు స్వాగతం చెప్పేందుకు భాగ్యనగర్ తండా కు చెందిన కాంగ్రెస్ నేతలు భారీ సంఖ్యలో



సర్పంచ్ భానోత్ హిరాలాల్ ఆధ్వర్యంలో నేతలు ఆదివారం భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వం లక్షలాది రూపాయల వ్యయంతో చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల నేడు బడుగు బలహీన మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయన్నారు . అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తూ కష్ట కాలంలో రైతులకు రైతు భరోసా పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు.

# శిథిలావస్థకు చేరిన కామేపల్లి ప్రభుత్వ పశువైద్యశాల

**అవస్థలు పడుతున్నరైతులు, సిబ్బంది**

**ప్రభుత్వం తక్షణమే నూతన పశువైద్యశాల భవనం మంజూరు**

**చేసి నిర్మించాలనిగ్రామస్తులు డిమాండ్**

**కామేపల్లి, జూలై 19 ప్రభాతవార్త:**

కామేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పశు వైద్యశాల శిథిలావస్థకు చేరింది.ఆసుపత్రి పైకప్పు పెచ్చులు ఊడి పడుతుం డటంతో రైతులు, పశు వైద్య సిబ్బంది భ యాందోళన చెందుతున్నారు.వైద్యశాల ప్రమాదభరితంగా ఉండటంతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని బిక్కు బిక్కు మంటూ వైద్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.వైద్యశాల భవనం నిర్మించి నాలుగు దశాబ్దాలు గడుస్తుండటంతో ఈ దుస్థితి నెలకొంది.ప్రమాదకరంగా తయారైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షం కురిసిన ప్రతిసారి ఆసుపత్రిలో వర్షపు నీరు కారుతూ ఆసుపత్రిలో ఉన్న విలువైన మందులు,



ఇంజక్షన్ లు తడుస్తున్నాయన్నారు.ఈ విషయం ను ప్రభుత్వము,సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే నూతన భవనం మంజూరు చేసి నిర్మించి దీర్ఘకాలంగా పడుతున్న ఇబ్బందులను తొలగించాలని రైతులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు,రాజకీయ పక్షాల నాయకులు ఆదివారం డిమాండ్ చేశారు.లేని యెడల ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.



# సందిగ్ధంలో మిర్చి సాగు రైతులు

కల్లూరు జూలై 19, ప్రభాతవార్త



కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో మిర్చి సాగు రైతులు వర్షాభావ పరిస్థితుల వలన సందేశం లో ఉన్నారు. మండల పరిధిలోని దారుక బంజరు, చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, తెలగవరం మరల పాడు, వెన్నవల్లి, చెన్నూరు, లక్షీ మ్రపురం, బత్తులపల్లి, పేరువంచ తదితర గ్రామాలలో మిర్చి సాగుకు దుక్కులు దున్ని చేలు సిద్ధం చేసుకొని ఉన్నారు. ఈ సమయంలో సుమారు 500 ఎకరాలు పైగా 300 మంది రైతులు మండలంలో సాగుకు సిద్ధమై ఉండగా ఈ సమయంలో ఎల్ నిన్ నో ప్రభావంతో వర్షాలు గత 18 రోజులుగా కురవనందున మిర్చి సాగు రైతులు సందిగ్దంలో అయోమయంలో ఉన్నారు .ఈ పరిస్థితులలో ఆగస్టు 5వ తేదీ నుండి మిరప నారు కూడా సిద్ధం చేసుకుని ఉంటున్నారు. అక్టోబర్ నెల నుంచి డిసెంబర్ వరకు ఈ మిర్చి పంటను కొనసాగిస్తారు .ఈ సమయంలో ఒక్కో ఎకరాకు 15000 రూపాయలతో ఎకరాకు మిరపనారు ఖర్చు, మొదటి నుంచి పంట చేతికి వచ్చేవరకు ఎకరాకు రెండు లక్షల పెట్టుబడి ప్రణాళికలతో సిద్ధం చేసుకొని ఉన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో నర్సరీలు కూడా ఇప్పటికే ఒక 15 రోజుల నుంచి సిద్ధం చేసుకుని ఉన్నారు. ఉద్యానవన శాఖ అధికారులు సబ్సిడీలతో వారికి వారితో సమీక్షలు చేసుకొని ఉన్నారు. అయితే ఈ సీజన్ కు మిర్చి పంట సాగుకు అయోమయం సందిగ్ధంలో ఉన్నారు. దీనివలన రైతుల్లో ఈ సంవత్సరం పంట దిగుబడి తక్కువతో పాటు సాగు కూడా కష్టమే అని రైతుల్లో చర్చలు కొనసాగుతున్నవి. ఈ సంవత్సరం మిర్చి సాగు ప్రశ్నార్థకంగా మారింది. వాతావరణంలో అనుకూలంగా వర్షాలు ఉంటే మిర్చి పంట సాగు చేయవచ్చని లేనిచో ప్రశ్నార్థకం అనుమానస్పదంగా మిర్చి పంట ఉంటుందని రైతుల్లో చర్చలు కొనసాగుతున్నవి. ఈ సంవత్సరం మిర్చి పంటకు ఈ సీజన్ కలిసివచ్చేనా ?అంటూ ఒకరు ఒకరు చర్చలు కొనసాగిస్తున్నారు.

# పంచాయతీ కార్మికుల మూడవ రాష్ట్ర మహాసభ సన్నహాక సమావేశం

కల్లూరు జూలై 19, ప్రభాతవార్త



ఈనెల 26న గణేష్ గార్డెన్ కళ్యాణమండపం రఘునాథపాలెం ఖమ్మం నందు జరిగే ఏఐటీయూసీ గ్రామపంచాయతీ ఉద్యోగుల కార్మిక సంఘం మూడవ రాష్ట్ర మహాసభ సన్నాహాక సమావేశం కల్లూరు మండలం లింగాలలో సత్తుపల్లి డివిజన్ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు మాగంటి రాజశేఖర్ అధ్యక్షతన సమావేశం జరిగింది .ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు, మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ జరుగు మూడో రాష్ట్ర మహాసభలో జయప్రదం చేయాలని ఈ మహాసభలలో గ్రామపంచాయతీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కొరకు తీర్మానాలు చేయాలని ప్రభుత్వం దృష్టికి ముఖ్యమంత్రి దృష్టికి కూనంనేని సాంబశివరావు ఎమ్మెల్యే ద్వారా తీసుకెళ్లి సమస్యల పరిష్కరించే విధంగా కృషి చేయుటకు మహాసభ ఉపయోగపడుతుందని ఇట్టి మహాసభను జయప్రదం చేయాలని ఈ సమావేశంలో కార్మికులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య ,వైరా మండల నాయకులు కంభంపాటి మహేష్, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి రాజశేఖర్ తోపాటు మండల కార్యదర్శి జానపాటి మల్లేష్ ,మండల నాయకులు మట్టూరు శేషగిరిరావు, చామర్తి వెంకటేశ్వర్లు ,దేవరపల్లి నరసింహారావు, బానోత్ రమేష్ తో పాటు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# మణుగూరులో రూ.3.50 కోట్లు అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి భూమి పూజ

మణుగూరు, ప్రభాతవార్త, జూలై 19:



మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో రూ.3.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావులతో కలిసి ఆదివారం భూమిపూజ నిర్వహించారు మండలంలోని . గుట్ట మల్లారం నుండి కట్టు మల్లారం వరకు రూ.1 కోటి అంచనా వ్యయంతో నిర్మించబోయే బీటీ రోడ్డు పనులకు, అలాగే సాయి నగర్ నుండి లంక మల్లారం వరకు రూ.2.50 కోట్ల వ్యయంతో నిర్మించబోయే హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేసి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ పనుల ద్వారా వర్షాకాలంలో ప్రజల రాకపోకల ఇబ్బందులు తొలగి, గ్రామాల మధ్య అనుసంధానం బలోపేతం కానుందని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ బి. రాహుల్, సబ్ కలెక్టర్,సబ్ కలెక్టర్ మృనాల్, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవీ ప్రసన్న, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

# గిరిజనేతర పేదల భూములకు రక్షణ కల్పించాలి

## మంత్రి పొంగులేటికి సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకులు వినతి

మణుగూరు, ప్రభాతవార్త, జూలై 19:



ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతర పేదల భూములకు రక్షణ కల్పించాలని, అర్హులైన గిరిజనుల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆయన ఆదివారం మణుగూరులోని ఇల్లందు గెస్ట్ హౌస్ లో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలోని గిరిజనేతర పేదలు దశాబ్దాలుగా గిరిజనులతో కలిసి జీవిస్తూ, తమకున్న కొద్దిపాటి ప్రభుత్వ భూములపైనే ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. గతంలో ప్రభుత్వం ఈ భూములకు శిస్తులు వసూలు చేస్తూ, వాటి ఆధారంగా సహకార బ్యాంకుల్లో రుణాలు కూడా ఇచ్చేదని గుర్తుచేశారు. కానీ కొంతకాలంగా ఇవన్నీ నిలిపివేయడంతో వారి భూములకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే అర్హులైన గిరిజనులందరికీ పోడు పట్టాలు ఇచ్చి, అటవీ శాఖ అధికారుల దాడులను అరికట్టాలని, అటవీ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు మధుసూదన్ రెడ్డి తెలిపారు




# బాలికల వసతి గృహం ప్రారంభానికి సిద్ధం

కల్లూరు జూలై 19, ప్రభాతవార్త



కల్లూరు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బాలికల వసతి గృహం ప్రారంభానికి సిద్ధమైంది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందినట్లు ప్రిన్సిపల్ వేముల శేఖర్ తెలిపారు. దీనితో కల్లూరు ప్రాంత ప్రజలు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు ఎన్నో సంవత్సరాలు బట్టి ఎదురుచూస్తున్న కలలు నేటికీ నిజమైనట్లు మండల ప్రజలు తెలుపుతున్నారు .ఈ కళాశాల ఆవరణలో వసతి గృహం పేద మధ్యతరగతి విద్యార్థులు విద్యను అభ్యసించుటకు ఎంతో అనుకూలంగా ఉంటుందని ఈ కళాశాలలో సుమారుగా 200 మంది విద్యార్థినిలు చదువుకునేందుకు అనుకూలంగా ఉంటుందని ప్రిన్సిపాల్ వివరిస్తున్నారు. ఈ కళాశాల వసతిగృహం ప్రారంభమైతే కల్లూరు, తల్లాడ ,పెనుబల్లి, మండలాల వారికి ఉపయోగపడుతుందని దూర ప్రాంతం పోకుండా దగ్గరలోనే బాలికలు చదువుకునేందుకు ఈ వసతి గృహం ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా బాలికల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వసతి గృహంలో పేద, ఓసి ,ఎస్సి, ఎస్టి ,బిసి సామాజిక వర్గాలకు చెందిన వారికి సమీకృత వసతి గృహం ఎంతో ఉపయోగపడుతుందని బాలికల తల్లిదండ్రులు స్థానిక మంత్రులు కు ప్రభుత్వానికి ప్రత్యేకమైన ధన్యవాదములు తెలుపుతున్నారు .గత 30 సంవత్సరాల సంవత్సరాల కల నెరవేరిందని త్వరలో ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు.

# వేములూరు బాధితులను పరామర్శించిన ట్రైబల్ ఫోరం. సిపిఐ ఎంఎల్ పార్టీ

అశ్వాపురం,ప్రభాతవార్త, జూలై 19;

అశ్వాపురం మండలం మనుబోతులపాడు గ్రామపంచాయతీ వేములూరు పోడు భూమి సాగుదారులపై ఫారెస్ట్ వారు చేసిన విచక్షణ రైతుల దాడులను ఖండిస్తూ ఆ దాడిలో గాయపడిన వారిని పరామర్శించడం ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం, సిపిఐ ఎంఎల్న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు,తుడుండెబ్బ జిల్లా నాయకులు దుగ్గరపు వీరభద్రం, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కల్తీ వెంకటేశ్వర్లు, ఏఐటిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ సుర్ణపాక నాగేశ్వరరావు,జిల్లా కన్వీనర్ మోకాళ్ళ రమేశ్, పివోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు పెద్దగోని ఆదిలక్ష్మిలు భాధితులని పరామర్శించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూమిలోకి వెళ్లి విత్తనాలు నాటుతున్న సమయంలో జెసిబిలను తీసుకొచ్చి ట్రెంచ్ లు వేస్తున్న అధికారులు అడ్డుకోవడానికి వెళ్ళిన మహిళలపై ఫారెస్ట్ అధికారులు మహిళలని చూడకుండా విచక్షణ రహితంగా దాడి దారుణం అని అన్నారు.దీనితో మహిళలు మడకం గంగమ్మ,సలవం జ్యోతి,మడకం సీతమ్మ,సోడి సాయమ్మ,కణితి సారమ్మ,పూణెం రామలక్ష్మి అనే మహిళలతో పాటు మరో నలుగురిని తీవ్రంగా గాయపడి గాయపడ్డారన్నారుఎలాంటి హెచ్చరిక లేకుండా ముందు సమాచారం లేకుండా అకస్మాత్తుగా జెసిబి లతో వచ్చి భూములను గుంజుకోవాలని ముందస్తు ప్రణాళికతో వచ్చి అడ్డొచ్చిన ఆదివాసులను తీవ్రంగా గాయపరిచారని వారు అన్నారు.తాము అండగా ఉంటామని ఈ విషయంపై మానవ హక్కుల చట్టానికి, సుప్రీంకోర్టుకు,హైకోర్టుకు, హ్యూమన్ రైట్స్ వెళ్ళి కలుస్తామని న్యాయం జరిగే వరకు పోరాడుదాం అని వారు తెలియజేశారు.



## మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది..

### అంకితభావంతో పని చేయండి..

### గ్రామపెద్దలు కేశిరాజు లక్ష్మీనరసింహారావు

### దంపతులుమర్యాదపూర్వకంగా కలిసిన వార్డు సభ్యులు

*కూసుమంచి, జూలై 19 (ప్రభాతవార్త) :*

కూసుమంచి మండలకేంద్రం, కూసుమంచి గ్రామ ప్రముఖులు స్వర్గీయ కేశిరాజు రంగారావు కుమారులు కేశిరాజు లక్ష్మీ మనరసింహారావుని కూసుమంచి వార్డు సభ్యులు బీజేపీ జిల్లా నాయకుడు గుండా ఉపేందర్ రెడ్డి, చెరుకుపల్లి వీరయ్యలు ఆదివారం వారి వ్యవసాయక్షేత్రంలో



మర్యాదపూర్వకంగా కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేశిరాజు దంపతులు మాట్లాడుతూ కూసుమంచి అభివృద్ధి కొరకు నిబద్ధతతో అందరూ కలిసి కట్టుగా పని చేయాలని సూచించినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా మీరు తలపెట్టిన నమస్తే కూసుమంచి కార్యక్రమం చాలా మంచి కార్యక్రమం అని, దానిని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించినట్లు వివరించారు. ఈ సందర్భంగా నిత్యం దేశం, గ్రామం కోసం పరితపిస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం, ప్రకృతి సమతుల్యం కోసం వివిధ కార్యక్ర మాలు చేస్తున్న కేశిరాజు దంపతులకు మొక్కను కానుకగా ఇవ్వడం జరిగి నట్లు ఉపేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు చెరుకుపల్లి వీరయ్య, అర్వపల్లి శ్రీను, ఉపేందర్, మధు, పాల్గొన్నారు.

### పిండిప్రోలు గ్రామంలో హత్యకి గురైన చెన్న సుగుణమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్.

*ప్రభాత వార్త న్యూస్ జూలై 19 తిరుమలాయపాలెం*

తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చెన్న సుగుణమ్మ దారుణ హత్య ఉదంతం పై శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. నగల కోసం వృద్ధురాలైన సుగుణమ్మను దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేసిన విషయం తెలిసిఆదివారం తన స్వగ్రామమైన పిండిప్రోలు కి చేరుకొన్న, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మృతురాలి నివాసానికి వెళ్లి ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె భర్త చెన్న జనార్ధన్ అతని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యాన్ని చెప్పి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామంలో స్థానిక ప్రజలతో, నాయకులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను, అక్కడ గతంలో జరిగిన దొంగతనాలను గురించి చెన్న సుగుణమ్మ హత్య ఉదంతం గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ శనివారం ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ కి అధికారికంగా లేఖ వ్రాశానని . తన సొంత గ్రామం పిండిప్రోలు అయినందున, ఈ దారుణ ఘటనతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని ఈ కేసుకు సంబంధించి తక్షణమే ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి, నిందితులను వీలైనంత త్వరగా పట్టుకోవాలని సీపీ ని కోరానని . ఇలాంటి హత్యా ఉదంతం, నేరాలు, భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండేందుకు గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి పూట పెట్రోలింగ్‌ను తీవ్రతరం చేయాలని, ఆయన లేఖ ద్వారా డిమాండ్ చేశానని . నిందితులకు కఠినమైన శిక్ష పడేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశానన్నారు . ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చామకూరి రాజ్ కుమార్, గ్రామ పెద్దలు చామకూరి వెంకన్న, చామకూరి సునీల్ చిట్టి, చామకూరి కిరణ్, వార్డ్ నెంబర్ పసలాది ముత్తయ్య, చామకూరి కృష్ణయ్య , ఊడుగుల బిక్షం, టిఆర్ఎస్ మండల నాయకులు బిల్లగిరి ధనంజయ, బి ఆర్ ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు గుంటి పుల్లయ్య బిల్లగిరి వెంకటేశ్వర్లు పగిడిపల్లి బాబు వంగూరి బాబు ఏళ్లే కోటయ్య తదితరులు పాల్గొన్నారు



## చింతకానిలో ఘనంగా ఏఐవైఎఫ్ మండల మహాసభ

*చింతకాని,ప్రభాతవార్త*

మండల కేంద్రంలోని కామ్రేడ్ విజయ్ కుమార్ భవనంలో ఆదివారం ఏఐవైఎఫ్ మండల మహాసభ జరిగింది. ఈ సభకు అబ్బూరి మహేష్ సభాధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ




జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, విద్యా రంగంలోని సమస్యలు, ప్రైవేటీకరణ, సామాజిక అసమానతలపై యువత చైతన్యవంతంగా పోరాడాల్సి న అవసరం ఉందన్నారు. యువత తమ హక్కుల సాధన కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఐక్యంగా ముందుకు వచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, శాస్త్రీయ దృక్పథం, సామాజిక బాధ్యతతో ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు.

**కొత్త కమిటీ ఏకగ్రీవ ఎన్నిక:** మహాసభలో నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు: షేక్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి: బొళ్ళ భాను, వర్కింగ్ ప్రెసిడెంట్: గోగుల వెంకన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శి: రాంబాబు వీరితో పాటు మరో 17 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దోజు శ్రావణ్, జిల్లా సహాయ కార్యదర్శులు మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి, చింతల రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా కోశాధికారి కొల్లి రవికుమార్, ఘనపరపు ఉపేందర్, మామిళ్ల కిరణ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, సింగారపు సత్యనారాయణ, గోగుల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.







## వానలు కురవాలని బొడ్రాయి కి జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

*నేలకొండపల్లి, జూలై 19 ప్రభాతవార్త:*

వానలు కురవాలని పంటలు బాగా పండాలని కోరుతూ నేలకొండపల్లి గ్రామ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మహిళలు ఆదివారం గ్రామం లోని బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు



గ్రామ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మహిళలు జలబిందెలు నెత్తిన పెట్టుకుని స్థానిక ప్రభుత్వ హైస్కూల్ వద్ద గల బొడ్రాయి వద్ద వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం, బొడ్రాయికి మహిళలు జలాభిషేకం చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి గ్రాసర్పంచ్ శీలం వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి విపత్తులు రాకుండా ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని, పాడి పంటలతో సిరిసంపదలతో ఉండాలని కోరుతూ బొడ్రాయి కి జలాబిషేకం చేశారు. మహిళలు ఆటా పాటలతో సందడి చేశారు. గ్రామస్తులు పెద్ద త్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు లింగం యలమంద, చింతమళ్ల చిందు. మాదాసు సుజాత, గద్దం చంద్రకళ, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ లీకేజీకి మంత్రిదే బాధ్యత

### కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్..

### సోనం వాంగ్‌చుక్ అక్రమ అరెస్టును ఖండిస్తూ నిరసన ప్రదర్శ..

### ఏదులాపురంలో ప్రత్యామ్నాయ పౌర సమాజం ఆధ్వర్యంలో ర్యాలీ

*ప్రభాత వార్త ఖమ్మం రూరల్,*

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ప్రత్యామ్నాయ పౌర సమాజం (సీసీపీ) డిమాండ్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ పరీక్షల్లో చోటుచేసుకున్న అవకతవకలకు బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, కేంద్ర విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని కోరింది. నీట్ పరీక్ష అవకతవకల కారణంగా పలువురు విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని, కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, మరికొందరు ఆర్థికంగా, మానసికంగా నష్టపోయారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి తీవ్ర పరిణామాలు చోటుచేసుకున్నప్పటికీ విద్యాశాఖ మంత్రి తన పదవిలో కొనసాగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. లడఖ్ ప్రజల హక్కుల పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద గత 22 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన మెగసెసే అవార్డు గ్రహీత, పర్యావరణవేత్త, సాంకేతిక నిపుణుడు సోనం వాంగ్‌చుక్‌ను అక్రమంగా అరెస్టు చేసి ఆస్పత్రిలో నిర్బంధించడం దుర్మార్గమైన చర్యగా సీసీపీ నాయకులు అభివర్ణించారు. శాంతియుత నిరసనలను అణిచివేసే కేంద్ర ప్రభుత్వ వైఖరి ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ మోండి వైఖరికి నిరసనగా ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్ సెంటర్ నుంచి కేబుల్ బ్రిడ్జి వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, విద్యార్థులు, యువకులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని, సోనం వాంగ్‌చుక్‌ను తక్షణమే విడుదల చేసి ఆయన వినిపిస్తున్న అంశాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యామ్నాయ పౌర సమాజం నాయకులు విజయ్, ఐ.వి. రమణారావు, రవి మారుతి, కాకి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిషోర్, దండి సురేష్, శేషగిరి, సురేందర్, బషీర్, సుదర్శన్ రెడ్డి, బందెల వెంకయ్య, రమేష్, మహబూబ్ అలీ, ఉడుగు వెంకటేశ్వరరావు, ఎర్రమల్ల శ్రీనివాస్, పెరుమాళ్లపల్లి శ్రీనివాసులు, శోభన్, ధరావత్ రాములు, సాయిబాబా, దేవయ్య, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# ఏజెన్సీ ప్రాంతానికి క్యాన్సర్ 'రక్ష'

**'క్యాన్సర్ నిర్ధారణ కేంద్రం' ఏర్పాటుకు కలెక్టర్ అంకిత్ గ్రీన్ సిగ్నల్**

**గవర్నర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం..**

**రెడ్ క్రాస్ వినతికి తక్షణ స్పందన**

భద్రాచలం ప్రభాతవార్త :

ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన ప్రాంతాల్లో క్యాన్సర్ మహమ్మారి నివారణకు అడుగులు పడ్డాయి. పాల్వంచ పట్టణంలో అత్యాధునిక "క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కేంద్రం" ఏర్పాటు కానుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అంకిత్ సానుకూలంగా స్పందించారు. ఏజెన్సీ పరిధిలో క్యాన్సర్ కేసులు నానాటికీ పెరుగుతుండటంతో, తక్షణ నివారణ చర్యల కోసం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ బృందం శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, క్యాన్సర్ నివారణ కేంద్రం ఏర్పాటుకు తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు రెడ్ క్రాస్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఎల్. కాంతారావు వెల్లడించారు. గవర్నర్ చొరవ.. వేగవంతమైన కదలికగిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను మరింత విస్తృతం చేయాలని గౌరవ గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. గవర్నర్ సెక్రటరీ దాన కిషోర్, రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి ఎ. శ్రీరాములు సూచనల మేరకు ఈ ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వ, రెడ్ క్రాస్ సంయుక్త భాగస్వామ్యంతో ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే.. ఏజెన్సీ పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి ఉచిత క్యాన్సర్ పరీక్షలు స్థానికంగానే దక్కనున్నాయి.




# ఇందిరమ్మ ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట

**రొంపేడులో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన**

**కామేపల్లి, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లో 33/11నూతన ఉపకేంద్రాన్ని ప్రజలకు అంకితం**

**సింగరేణి ఉన్నతికి, కార్మికుల సంక్షేమానికి కృషి**

**ఎస్టి సబ్ ప్లాన్ తో పోడు సాగుదారులకు ప్రత్యేక పథకాలు**

**ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

ఇల్లందు, జూలై 19 ప్రభాతవార్త

రాష్ట్రంలో ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేస్తూ విద్యుత్ మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. ఇల్లందు నియోజకవర్గ పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ అంకిత్ పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం ఇల్లందు మండలం రొంపేడు గ్రామంలో రూ.3.25 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లో నిర్మించిన నూతన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాల విస్తరరాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త ఉపకేంద్రాల ఏర్పాటు, విద్యుత్ లైన్ల ఆధునికీకరణ, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాల పెంపు వంటి పనులను ప్రభుత్వం ప్రాధాన్యంగా చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి అభివృద్ధి.. ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యంతెలంగాణ అభివృద్ధిలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్న ఉప ముఖ్యమంత్రి, సంస్థ ఉత్పత్తి సామర్థ్యాల పెంపుతో పాటు ఉద్యోగుల సంక్షేమం, నిర్వాసితులకు న్యాయం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సింగరేణి, విద్యుత్ శాఖ ఉద్యోగులకు ప్రమాద బీమా రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో గిరిజన ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోడు భూముల హక్కులు పొందిన గిరిజన రైతులకు ఖఇందిరా సౌర గిరి జల వికాసంఖ పథకం ద్వారా ఉచిత సౌర విద్యుత్, బోర్ బావులు, పంపుసెట్లు, డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. 1912 టోల్ ఫ్రీ.. పవర్ అంబులెన్స్‌లతో వేగవంతమైన సేవలువిద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. 108 అత్యవసర సేవల తరహాలో ప్రవేశపెట్టిన పవర్ అంబులెన్స్‌ల ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, అవసరమైన పరికరాలు, సాంకేతిక సిబ్బందితో కూడిన బృందాలు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 165 పవర్ అంబులెన్స్‌లు సేవలందిస్తున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలు అవసరంఎల్‌నినో ప్రభావం ఎదుర్కొనేందుకు.. రాష్ట్రంలో ఎల్‌నినో నేపథ్యంలో అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. తాగునీటి వనరుల పరిరక్షణ, వ్యవసాయ అవసరాలు, వన్యప్రాణులకు నీటి లభ్యత, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యుత్ వ్యవస్థ మరింత బలోపేతంజిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రొంపేడు, ముత్యాలం పాడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ ఉపకేంద్రాలతో విద్యుత్ లోడ్ సమతుల్యమై, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న విద్యుత్ మౌలిక సదుపాయాల పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, వైరా ఎమ్మెల్యే రామదాస్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, ఇల్లందు మున్సిపల్ చైర్పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు బోళ్ళ సూర్యం, మడుగు సాంబమూర్తి, మండల రాము, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, డి.ఎస్.పి వెంకన్నబాబు సిఐ తాటిపాముల సురేష్ , ఇల్లందు విద్యుత్ ఎస్ ఈ మహేందర్, ఏడి కె రామారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మణుగూరు ఘటనపై విచారణకు అటవీ శాఖ ఆదేశాలు...

**జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్**

కొత్తగూడెం, జూలై 19 ప్రభాతవార్త:

మణుగూరు డివిజన్‌లో జూలై 17న అటవీ భూమి పరిరక్షణ పనుల సందర్భంగా జరిగిన ఘటనను అటవీ శాఖ తీవ్రంగా పరిగణించింది. ఘటనకు సంబంధించిన వీడియోలపై నిష్పక్షపాత విచారణకు జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ ఆదేశాలు జారీ చేసారు. విచారణ పూర్తయ్యే వరకు వీడియోలో కనిపించిన ఫారెస్ట్ బీట్ అధికారిని సస్పెండ్ చేయగా, కిన్నెరసాని డీఎఫ్‌వో అధ్యక్షతన ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారుల నుంచి వివరణలు కోరడంతో పాటు వీడియోలు, ఫోటోలు, వైద్య నివేదికలు తదితర ఆధారాలను కమిటీకి అందజేస్తున్నారు. విచారణలో దుర్వ్యవహారం లేదా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ తెలిపింది. అలాగే భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను పోలీసుల సమన్వయం, మహిళా సిబ్బంది, వీడియో రికార్డింగ్‌తో నిర్వహించనున్నట్లు పేర్కొంది. ప్రజలు, మీడియా పూర్తి విచారణ పూర్తయ్యే వరకు అసంపూర్ణ వీడియోల ఆధారంగా నిర్ణయాలకు రావద్దని, ప్రభుత్వ అటవీ భూముల పరిరక్షణతో పాటు ప్రజల గౌరవం, పారదర్శకతను కాపాడేందుకు శాఖ కట్టుబడి ఉందని జిల్లా అటవీ అధికారి తెలిపారు.

## ఆ "లింక్ రోడ్" ఆగమాగం.. ప్రయాణం నరకం

**తారు లేచిపోయింది.. అంతా గుంటలమయం**

జూలూరుపాడు, ప్రభాతవార్త, జూలై 19:



మండల పరిధిలోని మారుమూల గ్రామాలను కలుపుతూ దాదాపు పది నుంచి 10 నుంచి 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ముఖ్యమైన "లింక్ రోడ్డు" అది... గ్రామీణ ప్రజానీకంతో పాటు రైతాంగం ఆ రహదారిపై రాత్రి పగలు తేడా లేకుండా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. గత ఏడాది భారీ వర్షాల కారణంగా ఆ ప్రాంతంలోని తారు రోడ్డు మొత్తం ఆగమాగం అయిపోయింది. భారీ వర్షాలతో ఎక్కడ చూసినా తారు రోడ్డు కోతకు గురైంది. అంతేగాక తారు మొత్తం పూర్తిగా లేచిపోయి రాళ్ల తేలి గుంటల మయమైంది. అదే మండలంలో ప్రధానమైన "బేతాళపాడు లింకు రోడ్డు". ప్రస్తుతం ఈ రోడ్డుపై ప్రయాణం ప్రజానీకానికి నరకంగా మారింది. జూలూరుపాడు మండల కేంద్రం నుంచి పాపకొల్లు గ్రామ పంచాయతీ మీదుగా అన్నారుపాడు, గుండ్లరేవు, బేతాళపాడు, చింతలతండా, లైన్ తండా, సింగభూపాలెం మీదుగా సుజాతనగర్ మండల కేంద్రానికి చేరుతుంది. దీంతోపాటు బేతాళపాడు, చింతలతండా మధ్యలో రింగ్ రోడ్డు నుంచి కరివారిగూడెం మీదుగా కొమ్ముగూడెం వరకు తల్లాడ కొత్తగూడెం ప్రధాన రహదారిని కలుపుతోంది. మండలంలో సగభాగం వరకు ఈ లింకు రోడ్డు ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా మారింది. ఈ రహదారి పొడవునా మారుమూల గ్రామాలతో పాటు ఎటు చూసినా వ్యవసాయ భూములే ఉంటాయి. ఈ ప్రాంతం అంతటా రైతులు పలు రకాల పంటలను సాగు చేస్తుండటంతో, తమ అవసరాల కోసం రైతులు, రైతు కూలీలు నిత్యం ఈ రహదారిపైనే ప్రయాణిస్తుంటారు. అంతేగాక ఆ ప్రాంతంలోని గ్రామాలకు చెందిన చాలామంది విద్యార్థులు సుజాతనగర్, కొత్తగూడెం పట్టణంలోని విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తూ ఉండటంతో నిత్యం ఈ మార్గం వారికి కూడా ప్రధానంగా మారింది. పాపకొల్లు నుంచి గుండ్లరేవు, బేతాళపాడు నుంచి అటు చింతలతండా, మరోవైపు కరివారిగూడెం మీదుగా కొమ్ముగూడెం వరకు తారు రోడ్డు అధ్వానంగా తయారైంది. అంతేగాక తారు రోడ్డు వర్షాలతో కోతకు గురికావడంతో పలుచోట్ల వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. మండల కేంద్రమైన జూలూరుపాడులో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు ఉండటం, ఆ ప్రాంత ప్రజలు తమ అవసరాల కోసం మండల కేంద్రానికి చేరుకోవాలంటే అవస్థలు పడుతున్నారు. ప్రజల రవాణా, రాకపోకల సౌకర్యార్థం జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే మండలంలో ప్రధానమైన ఆ లింకు రోడ్డుకు మరమ్మతులు చేసి, అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.